



ప్రతిభ చాటిన ప్రబేషనరీకి కప్పును అందజేస్తున్న హోం మంత్రి అనిత



పోలీసు శిక్షణ కళాశాలలో డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న హోం మంత్రి, డీజీపీ

పోలీసుల ప్రతిష్ఠ పెంచండి

సాంకేతికతతో నేరాలను కట్టడి చేయండి

కలలను సాకారం చేసుకున్నారు..

అభినందనలు

ఐదేళ్లలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం

ఇక అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

హోం మంత్రి వంగలపూడి అనిత

ఘనంగా ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్



అనంతపురం క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను కట్టడి చేయాలని పోలీసులకు హోం మంత్రి అనిత సూచించారు. గంజాయి మత్తులో, రాజకీయ ముసుగులో ఎంతో మంది నేరాలకు పాల్పడుతున్నారని ఆమె అన్నారు. పోలీసుల ప్రతిష్ఠను పెంచేలా బాధ్యతగా నడుచుకోవాలని శిక్షణ పూర్తి చేసుకున్న 12 మంది డీఎస్పీలకు సూచించారు. నగరంలోని పోలీసు శిక్షణా కళాశాలలో డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హోం మంత్రి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రొబేషనరీ డీఎస్పీల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు హాజరైనందుకు ఎంతో ఆనందంగా ఉందని.. (మిగతా 4వ పేజీలో)



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎస్పీలు

అభివృద్ధి గ్రామ స్థాయి నుంచి జరగాలి

జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం విద్య/న్యూటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో గ్రామాలు సుభిక్షంగా ఉండాలంటే గ్రామ స్థాయి నుంచే అభివృద్ధి సాగాలని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ల ప్రారంభ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె అధికారులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం ఆవిష్కృతం కావాలంటే అభివృద్ధి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకూ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఇలా పరంపరగా కొనసాగాలన్నారు. పంచాయతీరాజ్ మూడంచెల వ్యవస్థలో గ్రామాలే కీలకం అన్నారు. పంచాయతీ శాఖ పరిధిలో పనిచేసే అధికారులు ఈ శిక్షణాకార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య, ఇతర డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు అధికారులు పాల్గొన్నారు.

శిక్షణలో చెప్పిన అంశాలు అమలు చేయాలి: డీపీఓ

జీపీడీఎస్ (గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ స్కీమ్) అమలులో భాగంగా తయారుచేసే అంచనాలకు సంబంధించి శిక్షణలో చెప్పే అంశాలు అమలు జరిగేలా చూడాలని డీపీఓ నాగరాజనాయుడు తెలిపారు. నగర శివారులోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు విభాగాల అధిపతులు హాజరై సూచనలు చేస్తారన్నారు. అందుకు అనుగుణంగా జీపీడీఎస్ తయారు చేయాలన్నారు. అన్ని వివరాలు ప్రణాళిక ప్రకారం ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి పంచాయతీరాజ్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, డ్వామా, డీఎం అండ్ హెచ్ఓ తదితర అధికారులు హాజరై తమ అభిప్రాయాలను వివరించారు.

గుడిసెల పేరిట గుండు

వాగులు.. వంకల ఆక్రమణ

పేదల నుంచి భారీగా వసూళ్లు

సంఘాల పేరిట అమాయకులకు బురిడీ

వరదల్లో మునిగి.. నష్టపోతున్న బాధితులు

ఆక్రమణల తొలగింపు దిశగా అధికారుల చర్యలు

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సొంత ఇల్లు.. పేదల కల. నాలుగు అడుగుల స్థలం దొరికితే చాలు.. చిన్న గుడిసె వేసుకుని బతుకుదాం అనుకుంటారు. అలాంటి వారి అమాయకత్వాన్ని, ఆశలను ఆసరాగా చేసుకుని కొందరు వల విసురుతున్నారు. వంక పోరంబోకు భూములలో నిబంధనలకు విరుద్ధంగా గుడిసెలు వేయిస్తున్నారు. పేదలపై ప్రేమతో అనుకుంటే.. పొరపాటే. గుడిసెలు వేసుకునేవారి నుంచి అందినకాటికి దోచుకుంటున్నారు. ఆ సొమ్ముతో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. పేదల పక్షాన పోరాడే కుల సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన కొందరు.. ఆ ముసుగులో దందా నడిపిస్తున్నారు. తద్వారా ఆ సంఘాలకు, పార్టీలకు సైతం చెడ్డపేరు వస్తోంది. మరోవైపు.. వంకల్లో గుడిసెలు వరదలకు కొట్టుకుపోయి.. బాధితులు కట్టుబట్టలతో రోడ్డున పడుతున్నారు. మరోవైపు వంకల్లో ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు సిద్ధమౌతున్నారు. దీంతో పేదలు అన్నిరకాలుగా నష్టపోతున్నారు.

గుడిసెలే గుడిసెలు

● అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి 194, 214, 215 సర్వే నంబర్లలో 15 ఎకరాలకు పైగా వంక పోరంబోకు భూమి ఉంది. 194-8లోనే 10.50 ఎకరాలు ఉంది. వాటిలో ఇటీవల వందల సంఖ్యలో గుడిసెలు వెలిశాయి. ప్రతిపక్ష, వామపక్ష, దళిత సంఘాలకు చెందిన కొందరు పేదల చేత వీటిని ఏర్పాటు చేయించారు.

● రాప్తాడు మండలం పరిధిలోని కళాకారుల కాలనీకి చెందిన వామపక్షంలోని ఓ స్థాయి నాయకుడు స్థలాల పేరిట పేదల నుంచి డబ్బులు వసూలు చేశాడు. ఒక్కొక్కరితో కనీసం రూ.5 వేలు.. ఆపై వీలైనంత గుంజాడు. ఇలా రూ.అరకోటికి పైగా వసూలు చేసుకున్నాడు. ఆ సొమ్ముతో తాను ఉంటున్న ఇంటి పక్కన స్థలంలోనే ఇంకో ఇంటిని నిర్మించాడు. ఆ పనులకు గుడిసెలు వేసుకున్నవారిని వాడుకున్నాడు. అక్కడితో ఆయన వంతు ముగిసింది. ఆ తరువాత కుల సంఘాల నాయకులు కొందరు అక్కడ తిష్టవేశారు. వారికి మరికొంత మంది వామపక్ష నాయకులు తోడయ్యారు. ఇప్పుడు వారి వంతు కొనసాగుతోంది. గుడిసెలు వేసుకున్న ప్రజలను మభ్యపెట్టి.. పట్టాలు ఇప్పిస్తామని వారి చేత ధర్నాలు చేయిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వబోమని తెగేసి చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

● నగర శివారులోని వనమిత్ర వెనుకభాగంలో గురుదాస్ కాలనీ ఉంది. అక్కడ గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరితో రూ.30 వేలు మొదలుకొని రూ.లక్షలు వసూలు చేశారు. దొంగ పట్టాలు సృష్టించి వారిచేతిలో పెట్టారు. వాటి ఆధారంగా పంచాయతీ అధికారులతో కలసి ఇంటి గుత్తలు మంజూరు చేయించారు. స్థానికంగా ఉన్న ఆంజనేయస్వామి మాన్యంలో కుల సంఘాల నాయకులను అడ్డుపెట్టి ఒక్కొక్క ప్లాటు రూ.లక్ష నుంచి రూ.2లక్షలకు పైగా అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.

మునిగినప్పుడు.. ఏమయ్యారు..?

భారీ వర్షాలు, వరదల కారణంగా పండమేరు ఉప్పొంగింది. పది రోజుల క్రితం నగర శివారు ప్రాంతంలోని గుడిసెలు మునిగిపోయాయి. బాధితులను రక్షించేందుకు అధికార యంత్రాంగం నానా అవస్థలు పడింది. పేదలు కట్టుబట్టలతో మిగిలారు. గుడిసెలు వేయించిన ఏ ఒక్క నాయకుడూ అటు వైపు తొంగిచూడలేదు. ముంపు ప్రభావం తగ్గిన తరువాత ఒక్కొక్క నాయకుడు అక్కడి చేరి మళ్లీ ఆటలు మొదలు పెట్టారు. గుడిసెలను తొలగిస్తామని రెవెన్యూ అధికారులు గట్టిగా చెబుతున్నా.. మాటలతో మభ్యపెట్టి పేదలను గొడవలకు ఉసిగొలుపుతున్నారు. మూడు రోజుల కిందట 194-8 సర్వే నంబరు కొలిచేందుకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందితో కొందరు గొడవ దిగినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో ఓ నాయకుడు తన అనుచరవర్గంతో బెదిరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ నాయకుడిపై డీఎస్పీకి తహసీల్దారు ఫిర్యాదు చేశారు.



ఇటీవల నీటమునిగిన ఉప్పరపల్లిలోని గుడిసెలు

మహనీయుల పేరిట కాలనీలు

అర్బన్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ కాలనీలో ఇదే పరిస్థితి. లెక్చరర్స్ కాలనీ వెనుకభాగంలో ర్యాంబో అపార్ట్‌మెంట్ పక్కన వంక పోరంబోకు స్థలాన్ని ఎన్నికల సమయంలో కొందరు కుల సంఘాల నాయకులు పేదలతో గుడిసెలు వేయించారు. ఆ ప్రాంతానికి మహనీయుల పేర్లు పెట్టి.. వసూళ్లు ప్రారంభించారు. రూ.లక్షలు కొళ్లగొట్టారు. పేదల నుంచి వసూలు చేసిన సొమ్ముతో ఓ నాయకుడు తన ఇంట్లో అట్టహాసంగా శుభకార్యాన్ని నిర్వహించినట్లు తెలుస్తోంది. కాలనీ వేయక ముందు చేతిలో చిల్లిగవ్వ లేని నాయకుడు.. కాలనీ వేసిన తరువాత రాయల్ ఎన్‌ఫీల్డ్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటైనా బ్రిడ్జి వద్ద.. వంకకు ఆనుకుని వైసీపీ నాయకుడు స్థలాలను కేటాయించాడు. ఉప్పరపల్లి తరహాలో వర్షాలకు అక్కడ ఇళ్లు మునిగితే.. ఎవరు బాధ్యత వహిస్తారో తెలియాలి.



రాజీవ్‌కాలనీలో వంకకు ఆనుకుని చేపట్టిన నిర్మాణాలు

చట్టం పేరిట బెదిరింపులు

● వంకలు, వాగుల్లో గుడిసెలు వేయకూడదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఉప్పరపల్లి ఘటన నేపథ్యంలో గుడిసెలు తొలగించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పాటు వీఆర్వో, సర్వేయర్ ఆ ప్రాంతానికి వెళ్లారు. ఆక్రమణలను గుర్తించేందుకు హద్దులు ఏర్పాటు చేయాలని చూశారు. వారితో స్థానికంగా ఉన్న నాయకులు గొడవకు దిగారు. చట్టం పేరుతో భయపెట్టారు. దీంతో చేసేదిలేక అధికారులు విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించి వెనుదిరిగారు.

● రాజీవ్ కాలనీ గుడిసెలలోకి ఓ రెవెన్యూ ఉన్నతాధికారి వెళితే.. ఉప్పరపల్లి తరహాలోనే బెదిరించారు. కోర్టులో ఉన్న భూమిలోకి ఎలా వస్తారని ప్రశ్నించారు. కొన్నేళ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నామని, రెవెన్యూ అధికారులు తమను ఖాళీ చేయాలంటున్నారని కోర్టును ఆశ్రయించారు.

నష్టపోతున్న పేదలు

సంఘాల నాయకులు, రాజకీయ నాయకుల వలలో పడి పేదలు నష్టపోతున్నారు. వంకలు, వాగుల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి చట్టం ఒప్పుకోదు. ఈ విషయాన్ని దాచిపెట్టి.. నాయకులు పబ్బం గడుపుకుంటున్నారు. పేదలకు మాయ మాటలు చెప్పి గుడిసెలు వేయిస్తున్నారు. సొంత ఇల్లు కట్టుకోవచ్చని ఆశపడిన కొందరు అప్పు తెచ్చి మరీ గుడిసెలు వేసుకుంటున్నారు. అక్కడ నివాసం ఉంటే ఏదో ఒక రోజు అధికారులు పట్టాలు ఇస్తారని భావిస్తున్నారు. ఒక్కోసారి నాయకులు తెచ్చిచ్చే నకిలీ పట్టాలనే అసలైనవని నమ్మి మోసపోతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. భారీ వర్షాలు కురిసినప్పుడు ఆక్రమిత వంకలు, వాగుల్లోకి వరద నీరు పోటెత్తుతోంది. గుడిసెలు మునిగిపోతున్నాయి. విలువైన సామగ్రి, నిత్యావసరాలు, దుస్తులు.. అన్నీ నీటిపాలౌపోతున్నాయి. అదృష్టవశాత్తూ పండమేరు ఘటనలో బాధితులు ప్రాణాలతో బయట పడ్డారు. లేదంటే పరిస్థితి ఏమిటి..?

కేసులు నమోదు చేయాలి..



వంకలు, వాగుల్లో కొట్టాలు వేయించినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. పేదల అమాయకత్వాన్ని, అవసరాన్ని ఆసరగా చేసుకుని కుల సంఘాలు నాయకులు, అధికార, ప్రతిపక్ష, వామపక్ష నాయకులు కొందరు మోసం చేస్తున్నాయి. ఇదో ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పేదల పొట్ట కొట్టి రూ.కోట్లు సంపాదిస్తున్నారు. ఉప్పరపల్లిలో రూ.5 వేలకూ పట్టా ఇచ్చారు. ఇంతకంటే మోసం ఎక్కడా ఉండదు. పదివేలు ఇరవై వేలు ఇచ్చేవారు వస్తే.. ముందు అప్పటికే రూ.5 వేలకు అమ్మిన స్థలాలను ఇచ్చి మోసగిస్తున్నారు. ధర్నాలకు, ఇతర అవసరాలకు గుడిసెల్లోవారిని వాడుకుంటున్నారు. కొందరు మహిళలను వేధిస్తున్నారు. బాధితులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినా తక్షణ న్యాయం జరగడం లేదు.

– సాకే హరి, రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ

తొలగించక తప్పదు...

ఉప్పరపల్లి ప్రాంతంలో వర్షాలకు గుడిసెలు, మూడు నాలుగు కాలనీల్లో ఇళ్లు ముంపునకు గురయ్యాయి. అప్పటి పరిస్థితిని చూసి కూడా చర్యలు తీసుకోకపోతే మాదే తప్పవుతుంది. వంకలో వేసుకున్న గుడిసెల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. అక్కడ మూడు రోజుల కిందట హద్దులు ఏర్పాటుకు వెళ్లిన రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బందితో ఓ నాయకుడు దుసుగా ప్రవర్తించాడు. బెదిరించాడు. దీంతో పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసు భద్రత నడుమ చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌కుమార్, తహసీల్దార్, అనంతపురం రూరల్

కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు..



రాజీవ్ కాలనీ వంక పోరంబోకు భూముల్లో కుల సంఘాల నాయకులు, మరి కొందరు మూడు ప్రాంతాల్లో గుడిసెలు ఏర్పాటు చేయించారు. ఏళ్ల తరబడి అక్కడ నివాసం ఉంటున్నట్లు కోర్టు నుంచి ఆ నాయకులు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. వారుగాని, మేముగాని అక్కడ ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకూడదని కోర్టు ఆదేశించింది. కానీ అక్కడ వారు నిర్మాణాలు చేపడుతున్నారు.కోర్టులో విచారణ జరుగనుంది. న్యాయ స్థానం ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటాం.

– హరికుమార్, తహసీల్దార్, అనంతపురం అర్బన్

టెక్నాలజీ అప్‌డేట్ నిరంతర ప్రక్రియ

జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ టెక్నాలజీ అప్‌డేట్ నిరంతర ప్రక్రియ అని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగంలో ఇ-మెర్జ్-2024 జాతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ మమత, అసోసియేట్ ప్రొఫెసర్ లలితకుమార్ సమన్వయ కర్తలుగా, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టం, పవర్ ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలు ఎలక్ట్రానిక్స్ రంగ రూపురేఖలను మార్చేశాయని తెలిపారు. ఇలాంటి జాతీయ సదస్సుల్లో వాటిపై చర్చించడం ద్వారా విద్యార్థుల్లో నూతన ఆలోచనలు రేకెత్తుతాయన్నారు. కళాశాల, పరిశ్రమల మధ్య సంబంధాలను మెరుగుపరుచుకుంటే విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్‌తోపాటు ఉద్యోగాలు వస్తాయని బెంగళూరు అలోనల్ టెక్నాలజీస్ ప్రతినిధి జయప్రకాష్ పేర్కొన్నారు.

● సీఎస్ఈ విభాగంలో ఆధునిక కంప్యూటింగ్ అనే అంశంపై ఏర్పాటు చేసిన మరో సదస్సులో వీసీ ప్రసంగించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విజ్ఞానాన్ని పెంపొందించుకునే అధ్యాపకులు అర్థవంతమైన బోధన చేయగలరని అన్నారు. కంప్యూటర్ సైన్స్‌లోని వివిధ అంశాలపై చర్చించేలా మూడురోజులపాటు సదస్సు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రొఫెసర్లు ఏపీ శివకుమార్, ఆర్.రాజశేఖర్ సమన్వయకర్తలుగా వ్యవహరించిన సదస్సులో పలువురు డైరెక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

ఉద్యోగం రాలేదని ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెస్సీ పూర్తి చేసినా అందుకు తగిన ఉద్యోగం రాలేదన్న ఆవేదనతో నందిని(31) అనే మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... సదాశివ నగర్‌లో నందిని, అనిల్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. నందిని ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తి చేసింది. అనిల్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. భర్త అనిల్ లాడ్జిలో పనిచేస్తున్నాడు. నందినికి ఎప్పుడూ తన చదువుకు తగ్గ ఉద్యోగం రాలేదని బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో మంగళవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి పెంపకానికి సాయం

అనంతపురం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) జిల్లాలోని పాడి రైతులు బహువార్షిక పశుగ్రాసం పెంచుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. జిల్లా లో వెయ్యి ఎకరాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉపాధి పథకం కింద ఒక్కో పాడి రైతుకు అర ఎకరాలో పశుగ్రాసం పెంచేందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం అందజేస్తుందని పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి, డివిజన్ డీడీ రమేష్‌రెడ్డి తెలిపారు. పాడి పశువులు, బోరు బావి ఉన్న పాడి రైతులకు పథకం వర్తిస్తుందని తెలిపారు. ఐదెకరాల విస్తీర్ణం కలిగిన చిన్న, సన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుతో రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



బెస్ట్ ఆల్ రౌండర్ జీవనకు కప్పును అందజేస్తున్న హోం మంత్రి అనిత



బెస్ట్ ఇండోర్ పురస్కార గ్రహీత ప్రదీప్తికి మెడల్



అమ్మతో అభిషేక్ ఆనందం



ఎన్ని గెలిచానో చూడండి..(జీవన)



హోం మంత్రి అనిత, డీజీపీతో ప్రొబేషనరీ డీఎస్పీల గ్రూప్ ఫొటో



తల్లితో ఆనందం పంచుకుంటున్న కదిరికి చెందిన ప్రొబేషనరీ డీఎస్పీ భవాని



సాధించావు నాన్నా..



పాల్గొన్న ప్రొబేషనరీ డీఎస్పీల కుటుంబ సభ్యులు



హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు



కుటుంబ సభ్యులతో జ్ఞాపకం..



పబ్లిక్‌లోకి 12 సింహాలు

కలలను సాకారం చేసుకుని.. ఖాకీ వనంలోకి...

అనంత పీటీసీలో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్





అనంతపురం పోలీసు శిక్షణా కళాశాల నుంచి పన్నెండు పోలీసు సింహాలు పబ్లిక్‌లోకి అడుగు పెట్టాయి. ఏకంగా యాభై వారాలపాటు వివిధ అంశాలలో శిక్షణ పొంది.. శాంతిభద్రతల పరిరక్షణకు బయలుదేరాయి. వీరికి వీడ్కోలు పలికేందుకు, దిశా నిర్దేశం చేసేందుకు రాష్ట్ర హోం మంత్రి అనిత, పోలీస్ బాస్ ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథులుగా వచ్చారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీటీసీ ప్రిన్సిపాల్.. ఐజీపీ వెంకట్రామిరెడ్డి సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల సమక్షంలో కొత్త డీఎస్పీలు ప్రతిజ్ఞ చేశారు. కల సాకారమైన వేళ.. అయినవారి సమక్షంలో మధుర క్షణాలను ఉద్విగ్నంగా గడిపారు.

"నేను భారత దేశానికి, భారత దేశ రాజ్యాంగానికి విధేయంగా ఉంటానని, ఆంధ్రప్రదేశ్ పోలీస్ వ్యవస్థలో నిజాయతీతో వ్యవహరిస్తానని, నిష్పక్షపాతంగా, నిర్భయంగా రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తానని, రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజల హక్కులను గౌరవిస్తూ, నాకు అప్పగించిన విధులను, కర్తవ్యాలను చట్ట సమ్మతంగా నిర్వర్తిస్తానని మనఃపూర్వకంగా ప్రమాణం చేయుచున్నాను"

అని పలికే క్షణాల కోసం.. వారు ఎంతగా శ్రమించి ఉంటారు..! ఇంకెంతగా తపించి ఉంటారు..! 2023 బ్యాచ్‌కు చెందిన 12 మంది డీఎస్పీలు వీరు. గత ఏడాది నవంబరు 20న శిక్షణకు హాజరయ్యారు. దిగ్విజయంగా శిక్షణ పూర్తి చేసుకుని ప్రభుత్వం అప్పగించే విధుల కోసం సిద్ధమయ్యారు. ఈ పన్నెండు మందిలో ఏడుగురు మహిళలు ఉండటం విశేషం.

డిప్యూటీ తహసీల్దార్ భవాని.. డీఎస్పీ

శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం గంజివారిపల్లి చెందిన తలుపుల చెన్నకృష్ణయ్య, తులసి దంపతుల కూతురు భవాని. చెన్నకృష్ణయ్య కదిరిలో విద్యుత్ శాఖ ఏఈగా పని చేస్తున్నారు. బీటెక్ పూర్తి చేసిన తరువాత భవాని టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. కానీ నచ్చక రాజీనామా చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఉద్యోగం సాధించి, అగ్రికల్చర్ డైరెక్టరేట్‌లో పనిచేశారు. అనంతరం గ్రూప్-2 పరీక్షలు రాసి.. డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం సాధించారు. కడప జిల్లాలో ప్రొద్దుటూరు సమీపంలోని చాపాడులో డీటీగా పనిచేశారు. ఆ ఉద్యోగంతోనూ ఆగకుండా.. పోలీసు శాఖలో చేరాలని సంకల్పించారు. గ్రూప్-1కు కష్టపడి చదివారు. డీఎస్పీ పోస్టు సాధించారు.

● లక్ష్యం చేరిన ఉదయ పావని



విజయనగరం జిల్లాకు చెందిన కెల్లా ఉదయపావని ఇంజనీరింగ్ చదివారు. బీటెక్ పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం వైపు వెళ్లలేదు. ప్రభుత్వ అధికారిగా పనిచేస్తేనే తన చదువుకు అర్థం ఉంటుందని భావించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. 26 ఏళ్లకే గ్రూప్-1 పరీక్షతో సత్తా చాటి.. డీఎస్పీ పోస్టు సాధించారు.

● అభిషేక్ ... రెండో ఉద్యోగం




తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రావూరి రామ సదాసాయి అభిషేక్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆ వెంటనే ప్రభుత్వ ఉద్యోగ వేట ప్రారంభించారు. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఏసీఐఓ-2గా ఎంపికయ్యారు. ఆ ఉద్యోగం చేస్తూనే.. మరింత ఉన్నత ఉద్యోగం సాధించాలని భావించారు. ప్రజల కోసం నేరుగా ఏదైనా చేయాలని భావించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గ్రూప్-1 పరీక్షలు రాశారు. 2023లో డీఎస్పీ పోస్టుకు అర్హత సాధించారు.

● డెంటల్ ఆఫీసర్.. మానస



హైదరాబాద్‌కు చెందిన కడులూరు మానస వైద్యవిద్యను అభ్యసించారు. సికింద్రాబాద్ ఈసీహెచ్‌ఎస్‌లో డెంటల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో ఆమెకు సమాజ సేవ చేయాలనే ఆలోచన వచ్చింది. పోలీసు అధికారి అయితే తన లక్ష్యం నెరవేరుతుందని భావించారు. గ్రూప్-1 ఉత్తీర్ణత సాధించారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముందుకెళ్తానని ఆమె అన్నారు.

● ఇంజనీరింగ్ పావని.. డీఎస్పీ



గుంటూరు జిల్లాకు చెందిన బొంత పావని బీటెక్ చదివారు. ఆ తరువాత ఎంటెక్ పూర్తి చేశారు. కానీ సాఫ్ట్‌వేర్ ఫీల్డ్ వైపు వెళ్లలేదు. ప్రభుత్వ ఉద్యోగం, అందులోనూ గ్రూప్-1 స్థాయి అధికారిగా పనిచేస్తే ఎక్కువ మంది ప్రజలకు సేవ చేయొచ్చని భావించారు. ఆ దిశగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. గ్రూప్-1 పరీక్షలు రాసి డీఎస్పీ పోస్టు సాధించారు.

● అసిస్టెండ్ కమాండెంట్ కృష్ణ.. డీఎస్పీ



తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కడాలి జయక్రిష్ణ ఇంజనీరింగ్ చదివారు. ఆ తరువాత పలు పోటీ పరీక్షలు రాశారు. సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎంపికయ్యారు. ఆ ఉద్యోగం చేస్తూనే గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమయ్యారు. అనుకున్నట్లుగానే డీఎస్పీ పోస్టు సాధించారు.

● అలీ.. రెండు ఉద్యోగాలను దాటి..



కడప జిల్లాకు చెందిన పాలగిరి అష్రఫ్ అలీ బీటెక్ పూర్తి చేశారు. కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం చేశారు. ఆ తరువాత ఐడీబీఐలో అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగం సాధించారు. ప్రజల సమస్యలను నేరుగా విని.. వాటి పరిష్కారానికి కృషి చేయాలనే ఆలోచన ఆయనది. అందుకే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని భావించారు. గ్రూప్-1 కోసం పట్టుదలగా కృషి చేశారు. డీఎస్పీ పోస్టుకు అర్హత సాధించారు.

● డాక్టర్ చైతన్య.. డీఎస్పీ

కాకినాడకు చెందిన మోకన వెంకట క్రిష్ణ చైతన్య వైద్య విద్యను అభ్యసించారు. డెంటల్ డాక్టర్‌గా వృత్తిని స్వీకరించారు. కానీ ఎక్కడో అసంతృప్తి. ప్రభుత్వ అధికారిగా ప్రజా సేవకు అంకితం కావాలని నిర్ణయించుకున్నారు. తల్లిదండ్రులకు విషయం చెప్పారు. వారూ ప్రోత్సహించారు. దీంతో గ్రూప్-1పై దృష్టి సారించారు. ఆయన పట్టుదలకు ఫలితంగా 2023లో గ్రూప్-1లో డీఎస్పీ పోస్టు వరించింది.

● పోలీసు సింహాల్లోకి.. రాజసింహం



పల్నాడు ప్రాంతానికి చెందిన వెన్నా రాజసింహారెడ్డి ఇంజనీరింగ్ చదివారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. ఆ ఉద్యోగం ఆయనకు సంతృప్తినివ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగం చేయాలనేది ఆయన కల. గ్రూప్-1 కోసం గట్టిగా కృషి చేశారు. డీఎస్పీ పోస్టు సాధించారు. పోలీస్ అధికారిగా ప్రజలకు సేవ అందించడమే తన లక్ష్యమని ఆయన అంటున్నారు.

● కడప బిడ్డ.. శివప్రియ



కడప జిల్లాకు చెందిన అంకిరెడ్డిపల్లి శివప్రియ ఇంజనీరింగ్ అభ్యసించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. కానీ సంతృప్తి అనిపించలేదు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రూప్-1కు ప్రిపేర్ అయ్యారు. అనుకున్నట్లుగానే డీఎస్పీ పోస్టు సాధించారు.

● ప్రదీప్తి.. ఎస్ఐ.. డీఎస్పీ..



శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రదీప్తి ఇంజనీరింగ్ చదివారు. ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించి.. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అయ్యారు. ప్రజలకు మరింత సేవ చేసేందుకు ఇంకాస్త పెద్ద ఉద్యోగం సాధించాలని భావించారు. గ్రూప్-1 పరీక్షకు సిద్ధమయ్యారు. అనుకున్నట్లుగానే డీఎస్పీ పోస్టుకు అర్హత సాధించారు.

● చిన్నారి జీవన.. డీఎస్పీ



అల్లూరు సీతారామరాజు జిల్లాకు చెందిన జీవన బీఎస్సీ పూర్తి చేశారు. చదువుతున్న సమయంలోనే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. అదే సమయంలో గ్రూప్-1 నోటిఫికేషన్ వెలువడింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వెంటనే బరిలోకి దిగారు. 23 ఏళ్లకే డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న 12 మంది డీఎస్పీలలో జీవన చిన్నవారు. ఇప్పుడిప్పుడే చదువు పూర్తి చేసుకుని.. ఉద్యోగం కోసం ప్రయత్నించాల్సిన 'చిన్నారి జీవన..' ఏకంగా డీఎస్పీగా తల్లిదండ్రుల ముందు నిలిచారు. ఇంతకంటే వారికి ఆనందం ఏముంటుంది..?





మాట్లాడుతున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు, పీటీసీ ప్రిన్సిపాల్.. ఐజీపీ వెంకటరామిరెడ్డి



డీఐజీ షిమోషీ, అనంత ఎస్పీ జగదీష్, శాంతి భద్రతల విభాగం ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్





నాలుగో సింహ గర్జన

పోలీసుల ప్రతిష్ట పెంచండి

(3వ పేజీ తరువాయి)

హోం మంత్రి అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు ఈ వేదిక ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు.

కలల సాకారం..

డీఎస్పీలుగా శిక్షణ పూర్తి చేసుకున్నవారు ఎంతో కష్టపడి, నిద్రలేని రాత్రులు గడిపి అనుకున్నది సాధించారని, కలలను సాకారం చేసుకున్నారని హోం మంత్రి అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు విధుల్లో చేరబోతున్నారని అన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడే వృత్తిని ఎంచుకోవడం హర్షనీయమని అభినందించారు. పోలీసు ఉద్యోగం మిగతా వాటిలా కాదని, 24 గంటలు పని చేయాల్సి ఉంటుందని అన్నారు. నిజాయతీ, నిష్పక్షపాతం, బాధితులపట్ల సానుభూతి, విధి నిర్వహణలో నిబద్ధత కలిగి ఉండాలని అన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..

పోలీసు శాఖకు ప్రభుత్వపరంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హోం మంత్రి అన్నారు. గత ఐదేళ్లల్లో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో పోలీసు వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ప్రస్తుతం తమ ముందు అనేక సవాళ్లు ఉన్నాయని అన్నారు. పోలీసు స్టేషన్ల నిర్మాణం, ఆధునికీకరణ పనులు చేయాల్సి ఉందని అన్నారు. పోలీసు వ్యవస్థను పటిష్టం చేయడమంటే ఆయుధాలు ఇవ్వడమో.. వాహనాలు ఇవ్వడమో కాదని, పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వడమని అన్నారు. ప్రతి జిల్లాలోనూ సైబర్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రొబేషనరీ డీఎస్పీలుగా విధుల్లోకి వెళుతున్న నేపథ్యంలో బాధ్యతగా వ్యవహరించి, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆమె సూచించారు.

అప్‌డేట్ కావాలి: డీజీపీ

మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసులు అప్‌డేట్ కావాలని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. సైబర్ నేరాలు విస్తృతమయ్యాయని, వాటి కట్టడి కోసం ప్రతి జిల్లాలో సైబర్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు సూత్రప్రాయంగా అంగీకరించారని తెలిపారు. సైబర్ ఫోరెన్సిక్ కోసం కొత్త పరికరాలను కొనుగోలు చేస్తామని తెలిపారు. వైట్ కాలర్ క్రైం, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, నార్కోటిక్స్ కట్టడి కోసం ప్రభుత్వం మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేయబోతోందని తెలిపారు. మానసిక వేదనకు గురిచేసే సోషల్ మీడియా క్రైం నియంత్రణకు తగిన చర్యలు చేపట్టబోతున్నామని అన్నారు. రాజ్యాంగ చట్టాలకు అనుగుణంగా పనిచేయాలని, ఈ విషయాన్ని మరువకూడదని అన్నారు. పోలీసులను ఆశ్రయించే వారిపట్ల మరింత సానుభూతితో ఉండాలని సూచించారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో చేసిన ప్రతిజ్ఞ మేరకు నిష్పక్షపాతంగా, నిర్భయంగా, రాగద్వేషాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని అన్నారు. పదవీ విరమణ పొందే వరకూ ప్రతిజ్ఞలోని అంశాలను మరువకూడదని అన్నారు. మానవ హక్కులను కాపాడుతూ, రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలకు అనుగుణంగా పనిచేయాలని డీజీపీ వారికి పిలుపునిచ్చారు.

ప్రతిభావంతులకు పతకాలు

శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాలలో ప్రతిభ చాటిన ప్రొబేషనరీ డీఎస్పీలకు హోం మంత్రి చేతులమీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్, ఐజీపీ వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి, ఉమ్మడి జిల్లా ఎస్పీలు జగదీష్, రత్న, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, జేసీ అశ్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మేయర్ వసీం, ఏఎస్పీలు, డీఎస్పీలు, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ప్రొబెషనరీ డీఎస్పీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





దీవెనలు.. శుభాకాంక్షల వెల్లువ..







వీక్షిస్తున్న ట్రైనీ ఎస్‌ఐలు

న్యూస్‌బాక్స్

నేడు ప్రత్యేక గ్రామసభలు
కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కరవు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ప్రాంతాల్లో బుధవారం ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అనంతపురం రూరల్, నార్పల, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల్లో కరవు నివారణ చర్యల్లో భాగంగా వివిధ పనులకు ఆమోదంతో తీర్మానాలు చేసి పనులు చేపడతారన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయా మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఏపీఓలు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు విషయం తెలియజేయాలన్నారు.

టమోటా కిలో రూ. 30

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 21, కనిష్ఠ ధర రూ. 13 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ. 34 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 34,250తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 23వేలు, సరాసరి రూ. 26 వేలుతో అమ్ముడుపోయాయని తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 43 టన్నుల చీనీకాయలు వచ్చాయని తెలిపారు.

స్ర్కీనింగ్ టెస్టుకు హాజరుకావాలి

పుట్టపర్తిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు ఈనెల 10వ తేదీ నిర్వహించనున్న స్ర్కీనింగ్ పరీక్షకు హాజరుకావాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ సాధికారత సందాలకులు శివరంగప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షకు ఎంపికైన అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణతోపాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించబడుతుందన్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం
రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక రూడ్ సెట్ సంస్థలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బ్యాంకుల తయారీలో ఉచిత శిక్షణ ఉరవకొండ ప్రభుత్వ బదిలీలో 13 రోజులపాటు నిర్వహిస్తున్నామన్నారు. ఆదేవిధంగా గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్, కంప్యూటర్ టాలీ కోర్సుల్లో శిక్షణ ఈనెల 13వతేదీ నుంచి 30రోజులపాటు ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 18-45 సంవత్సరాల వయస్సు కలిగి ఆధార్, రేషన్ కార్డు ఉన్న మహిళలు అర్హులన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 9440905479 లను సంప్రదించాలని కోరారు.

నేడు 20వ మహాజనసభ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతి జిల్లా సమాఖ్య 20వ వార్షిక మహాజనసభ బుధవారం స్థానిక వంగలేరోడ్డు సమీపంలో ఉన్న టీటీడీసీలో నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పేకేశ్వీ, రామక్క మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గత మహాసభ సమావేశాలపై సమీక్ష, 2023-24 ఆర్థిక సంవత్సరంలో లెక్కలు, ఆడిట్, నివేదికపై చర్చిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, బడ్జెట్‌పై చర్చ ఉంటుందన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పు

గోరంట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేశ్వరి కాలనీలో బోయిని మల్లికార్జున ఇంటి ముందు ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టారు. మల్లికార్జున చేనేత మగ్గాలు నిర్వహిస్తున్నాడు. ఇంటి ముందు ఏర్పాటు చేసిన కొట్టం కింద ద్విచక్ర వాహనాలు ఉంచాడు. ఆ వాహనాలు పాక్షికంగా కాలిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఎంపిక


జయంత్ కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-19 మల్టీ డే జట్టుకు జిల్లా క్రీడాకారుడు జయంత్ కృష్ణ ఎంపికయ్యాడు. 2024-25 సీజన్‌లో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న బీసీసీఐ కూచ్ బెహార్ ట్రోఫీకి ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు.

నల్లి లిపేస్తున్న
మిరప పంటలో ఎర్ర, నల్లనల్లి ఉధృతి

మిరప పూతపై పదుల సంఖ్యలో నల్ల నల్లి పురుగులు



మిరప ఆకు కింది భాగంలో సోకిన ఎర్ర నల్లి



- విల్ట్, ఆకుముడతతో అన్నదాత కుదేలు
- పూత, పిందె దశలో ఎండిపోతున్న పంట
- పురుగు మందులు వాడినా నిష్ప్రయోజనం
- పెరిగిన పెట్టుబడితో రైతన్న విలవిల

కాపుదశలో పంటలు దెబ్బ తింటున్నాయి



మూడు ఎకరాల్లో మిరప సాగు చేశా. పురుగుల నివారణకు రకరకాల మందులు వాడినా ఫలితం లేకుండా పోతోంది. వారానికి రెండు సార్లు మందులు వాడాల్సి వస్తోంది. ప్రస్తుతం మిరపకు ఎర్ర నల్లి, నల్ల నల్లి ఆశించడంతో ఎదుగుదల లేకుండా పోయింది. కాయలు ఎర్రబారుతున్న సమయంలో నల్లి దెబ్బకు మచ్చలు ఏర్పడి పంట ఎదుగుదల లేకుండా పోయింది. పంట ఎదుగుదలకు ఎరువులతో పాటు పిచికారీ మందు వాడుతున్నా. అయినా పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదు.

- నాగరాజు, రైతు


ఆకు ముడత సోకి ముడతలు పడిన మిరప పంట


విల్ట్‌తో మచ్చలు పడి ఎండిన మిరప కాయలు

విడపనకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మిరప రైతులను తెగుళ్ల కష్టాలు వీడటం లేదు. గత ఏడాది వర్షాలు, గిట్టుబాటు ధర లేక మిరప రైతులు లక్షల్లో నష్టపోయి అప్పుల పాలయ్యారు. ఈ ఏడాదైనా మంచి దిగుబడితో లాభాలు వస్తాయని ఆశించిన రైతన్నకు తెగుళ్ల రూపంలో నిరాశే ఎదురవుతోంది. జూలై నెలలో సాగు చేసిన మిరప పంట ప్రస్తుతం మంచి పూత, కాయ దశలో ఉంది. అయితే వర్షాలు అధికం కావటంతో తెగుళ్ల ఉధృతి పెరిగింది. గత ఏడాది లాగే ఈసారి కూడా నల్ల నల్లి పురుగుతో పాటు ఎర్ర నల్లి కూడా ఆశించింది. రెండు రకాల పురుగులు సోకటంతో మిరపకాయలకు మచ్చలు ఏర్పడి ఎర్రకాయలు కూడా నల్లగా మారి కుళ్లి పోతున్నాయి. ఎర్రనల్లితో కిందిభాగంలో ఎర్రగా మారి ఆకులు మొత్తం ఎండిపోతున్నాయి. నల్ల నల్లి పురుగుతో పూత మొత్తం రాలిపోతోంది. నల్లి పురుగు ఆకులను గోకటం వల్ల ఎర్రగా మారి ఎండిపోతాయని రైతులు తెలుపుతున్నారు. రైతులు వాటిని నివారించేందుకు వారానికి రెండు సార్లు పురుగు మందులను పిచికారీ చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ఒక్కసారి పురుగు మందు పిచికారీ చేయాలంటే ఎకరాకు రూ.12 వేల నుంచి 15 వేలు ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు.

విల్ట్, ఆకు ముడత కూడా...

మిరప పంటకు ఎర్రనల్లి, నల్లనల్లికి తోడు విల్ట్, ఆకుముడత(బింగి) కూడా సోకింది. ఏ తెగులును అదుపు చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. కొన్ని చోట్ల మిరప పంటకు ఆకుముడత(బింగి), విల్ట్ సోకి పూర్తిగా ఎండి పోయాయి. కొన్ని నల్లి దెబ్బకు కాపు నిలబడ కుండా పోయాయి. హెబ్బెట్టి, జీటీసీ, హంద్రీనీవా కాలువ కింద అధికారికంగా వివిధ రకాల మిరప పంటలను 20 వేల ఎకరాల్లో సాగు చేశారు. విడపనకల్లు మండలంలో 10700ఎకరాల్లోను, వజ్రకరూరు మండలంలో 3200 ఎకరాల్లోను, ఉరవకొండ మండలంలో 3600 ఎకరాల్లోను, కూడేరు మండలంలో 1600 ఎకరాల్లోను, బెళుగుప్ప మండలంలో 2500 ఎకరాల్లోను మిరప పంటను సాగు చేశారు. గత ఏడాది 45వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. కానీ నల్లి గెబ్బకు, గిట్టుబాటు ధరలు లేక పోవటంతో ఈ ఏడాది 50శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ. లక్ష నుంచి 1.5లక్ష వరకూ పెట్టు బడులు పెట్టారు. ఎకరాకు కనీసం 5 క్వింటాళ్ల దిగుబడి వస్తే పెట్టుబడి అయినా కొంత తిరిగి వస్తుందని రైతులు చెబుతున్నారు.


నల్లి పురుగు నివారణకు మిరప తోటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసిన రైతు

విల్ట్‌తో వాడు ముఖం: సురేష్, రైతు



మూడు ఎకరాల్లో కడ్డీ రకం మిరప సాగు చేశా. వర్షాలు అధికమై తేమ ఎక్కువ కావటంతో పంటకు విల్ట్ తెగులు సోకింది. రకరకాల మందులు వాడినా ప్రయోజనం లేదు. పంట మొత్తం ఎండి పోయే పరిస్థితికి వచ్చింది. ఇప్పటికే ఎకరాకు రూ. లక్ష వరకూ పెట్టుబడులు పెట్టా. కనీసం పెట్టుబడి కూడా తిరిగి రాకుండా పోతోందని భయంగా ఉంది. ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలి.

జాగ్రత్తలతోనే రక్షణ: నెట్టికల్లు, హార్టికల్చర్ అధికారి



పంట సాగు చేసినప్పటి నుంచే తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎర్రనల్లి, నల్లనల్లి నివారణకు నీమ్ ఆయిల్ 3ఎంఎల్, అసిఫేట్ 1.5గ్రాములు లీటర్ నీటికి కలిపి మిరప మొక్కలపై పిచికారీ చేయాలి. గుడ్లను నివారించ గలిగితే పురుగును నివారించినట్లే. ప్రొపర్‌గేట్ 2ఎంఎల్ లేదా ఒబెరాన్ 1ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి మొక్కలపై పిచికారీచేయాలి. తెల్ల దోమ నివారణకు ప్రతి పొలంలోను పసుపు రంగు అట్టలను ఎకరాకు 40నుంచి50 వరకు ఏర్పాటు చేయాలి. విల్ట్ నివారణకు పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలి. సాలల్లో నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలి. మిరపను సాగు చేసే సమయంలోనే పంట చుట్టూ రక్షక పంటలు వేసుకోవాలి. జొన్న, సజ్జ వంటి పంటలను మేర సాలల్లో సాగు చేయాలి. 25నుంచి30మైక్రాన్ మల్చింగ్ వేసుకొని డ్రిప్ పద్ధతిలో మొక్కలకు సాగు నీరు పెట్టాలి. దీని ద్వారా పురుగు ఉధృతిని అరికట్ట వచ్చు.

పంట మొత్తం ఎండిపోతోంది: గంగన్న, రైతు



నేను 8 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశా. ఆకుముడత తెగులు, ఎర్రనల్లి తెగులు సోకి పచ్చని పంట పొలం మొత్తం ఎండి పోయే పరిస్థితికి వచ్చింది. ఇప్పటికే ఎకరాకు రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. ఎకరాకు ఒక క్వింటా, రెండు క్వింటాళ్లు దిగుబడి రావటం కూడా కష్టంగా మారింది. పెట్టుబడికి ఇప్పటికే రూ. 8లక్షలకు పైగా అయ్యింది. ఎకరాకు మూడు క్వింటాళ్లు కూడా దిగు బడి రావటం కష్టంగానే ఉంది. దాదాపుగా రూ. 8లక్షలు పెట్టుబడి నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

జగన్ పాలనలో ప్రాజెక్టులు నిర్వీర్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

బళ్లారి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏపీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నీటి ప్రాజెక్టుల అభివృద్ధికి నయాపైసా నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేశారని, ఫలితంగా రైతులు కష్టాలు పడ్డారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బళ్లారిలో ఆయన బళ్లారి జిల్లా కార్యదర్శి ఆదిమూర్తి ఇతర నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ నిర్లక్ష్యంతోనే తుంగభద్ర ఆయకట్టు రైతులు కష్టాలు పడ్డారన్నారు. కర్నాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి నీటి ప్రాజెక్టు అయిన తుంగభద్రకు జగన్ ఐదేళ్ల కాలంలో ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. మరమ్మతులను పట్టించుకోకపోవడంతోనే క్రస్ట్ గేటు కొట్టుకుపోయిందన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి ఆంధ్ర సరిహద్దు వద్ద ఎగువ, దిగువ కాలువలు ఆధ్వానంగా ఉన్నాయని, డ్యాం నుంచి 4,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా కనీసం 1500 క్యూసెక్కుల నీరు పారేందుకు కూడా వీలు లేకుండా పోయిందన్నారు. అయితే సీఎం చంద్రబాబునాయుడు నీటి ప్రాజెక్టులపై ఆసక్తి అధికమని, నిధులు విడుదల చేసి రైతులకు మేలు చేస్తారన్నారు. ప్రాజెక్టుల మరమ్మతుల విషయంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతారన్నారు. ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సహకరించి, బడ్జెట్ సమావేశాల్లో తుంగభద్రకు నిధులు కేటాయిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తుంగభద్ర క్రస్ట్ గేట్ల ఎత్తును 2020-22 మధ్య అడుగు ఎత్తు పెంచారని, ఈ విషయాన్ని అధికారులు ఎందుకు దాచిపెడుతున్నారని ప్రశ్నించారు. పెంచిన అడుగులో నీటిని నిల్వచేసుకుంటే ఇప్పటికే ఒక్క పంట నీరు లేదన్నారు. వాస్తవాలు వెల్లడించాలన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు
పలు మండలాల్లో కేసులు

అనంతపురంరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ విభాగం ఈఈ శ్రీహరి ఆధ్వర్యంలో రాప్తాడు, ధర్మవరం, ముదిగుబ్బ మండలాల్లో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో గృహ కనెక్షన్ తీసుకుని వ్యాపార సముదాయాలకు వాడుతున్నవారిని గుర్తించి 8 కేసులు, తీసుకున్న లోడు కన్నా అదనంగా వినియోగిస్తున్న వారిపై 17 కేసులు, మీటర్ ఉండి డైరెక్ట్‌గా కరెంటు వాడుతున్న వారిపై 15కేసులు నమోదు చేశారు. రూ.3.5లక్షల జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఈఈ నాగేంద్ర, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

రబీ వేరుశనగ సబ్సిడీ ధర ఖరారు

అనంతపురం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రబీ వేరుశనగ సబ్సిడీ ధరలను ఎట్టకేలకు ఖరారు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్వింటాల్ వేరుశనగ పూర్తి ధర రూ.9600గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3840 పోను రైతు వాటా కింద రూ.5760 చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది రబీ సీజన్‌కు జిల్లాకు 6671 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. ఒక్కో రైతుకు ఐదెకరాల దాకా గరిష్ఠంగా మూడు బస్తాలు (30కేజీల బస్తాలు) పంపిణీ చేస్తారు. గురువారం నుంచి జిల్లా లోని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ కావాల్సిన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు.

టెన్త్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు - 2025 ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించినట్టు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 18వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు. అలాగే రూ. 50 అపరాధ రుసుంతో ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు, రూ. 200 ఫైన్‌తో ఈనెల 26వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు, రూ. 500 ఫైన్‌తో వచ్చే నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు.

క్రిస్మస్ హైటీకి నిధులివ్వండి
- మంత్రికి స్వామిదాస్ వినతి

అనంతపురం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో క్రిస్మస్ హైటీ నిర్వహించేందుకు ప్రభుత్వం తరపున నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి జిల్లాకు రూ.1.50 లక్షలు మంజూరుచేశారని, ప్రస్తుతం ప్రతి జిల్లాకు రూ.3 లక్షలు మంజూరు చేయాలని కోరారు. చర్చిలకు ప్రాపర్టీ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన మంత్రిని కోరినట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి కార్తీక పూజలు



ఆత్మకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో కార్తీకమాస ప్రత్యేకపూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టు తిప్పి, అనంతరం అలంకరించారు. పాలాభిషేకం, పంచామృత అభిషేకం, బంగారు కవచసేవ, పల్లకి సేవ, ఆకుపూజ, అర్చన నిర్వహించారు. ప్రధాన అర్చకులు రామస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కాచిగూడ-యలహంక ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలు

గుంతకల్లు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే కాచిగూడ-యలహంక (17603/04) ఎక్స్‌ప్రెస్ రైలుకు ఈ నెల 7వ తేదీ నుంచి ఐదు అదనపు బోగీలను జతచేసి పంపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ రైలుకు రెండు 2-టైర్ బోగీలు, ఒక 3-టైర్ ఏసీ బోగీ, ఒక స్లీపర్ బోగీ, ఒక జనరల్ బోగీని శాశ్వత ప్రాతిపదికన జత చేయనున్నట్లు పేర్కొన్నారు.

స్లిప్ బోగీల తొలగింపు..

వాస్కోడిగామా-షాలిమార్ (17225) రైలుకు, కాచిగూడ-యలహంక (17603/04) రైలుకు ఉన్న స్లిప్ బోగీలను తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు. కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 6వ తేదీ నుంచి, వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8వ తేదీ నుంచి స్లిప్ బోగీలను తొలగించనున్నట్లు వారు తెలిపారు.

'పీఎం సూర్య ఘర్'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ పథకాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ అన్నారు. నగరంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు గురించి జిల్లా విద్యుత్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పథకం గురించి వినియోగదారులకు వివరించి రూఫ్‌టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించుకోవడం వలన కరెంటు బిల్లు ఆదా అవుతుందన్నారు. ఈ పథకం కింద అన్ని జాతీయ బ్యాంకులు 80శాతం రుణాలను ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఈఈటీ ప్రసాద్, ఈఈలు జేవీ రమేష్, రాజశేఖర్, డీఈఈ రామకృష్ణ పాల్గొన్నారు.

రేషన్ షాపు కోసం ఘర్షణ... నలుగురికి గాయాలు

క్రైంకార్నర్

ముదిగుబ్బ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.బండ్లపల్లిలో చౌకధరల దుకాణం డీలర్ కోసం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడినట్లు ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. బండ్లపల్లి గ్రామంలో రేషన్ షాపు మాకు కావాలని ఒక వర్గం, కాదు మాకే కావాలని మరో వర్గం సోమవారం రాత్రి ఘర్షణకు దిగారు. ఈ రెండు వర్గాల మధ్య పాతగొడవలు ఉన్న నేపథ్యంలోనే రేషన్ షాపు కోసం ఘర్షణ జరిగినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో రమేష్, అక్కులప్ప, లింగమయ్య, ఆదినారాయణ గాయపడ్డారన్నారు. ఇందులో లింగమయ్య ఆదినారాయణలను కదిరి ప్రభుత్వాస్పత్రికి, రమేష్, అక్కులప్పలను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 17 మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బధిర మహిళపై అత్యాచార యత్నం

సోమందేపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బధిర, ఒంటరి మహిళపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పెదబల్లి రామాంజనేయులు సోమవారం అర్ధరాత్రి అత్యాచారానికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన బధిరురాలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి రామాంజనేయులు తలుపు తట్టాడు. ఆమె ఎవరని తలుపు తీయగా చేయి పట్టుకుని లాగి అత్యాచారానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించి, అతడి బారి నుంచి తప్పించుకుని గ్రామస్థులపై పరుగులు తీసింది. దీంతో అతను పరారయ్యాడు. బాధితురాలు ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలియజేసి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ రాఘవన్ తెలిపారు. కాగా బాధితురాలికి ఎనిమిదేళ్ల కిందట కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తితో వివాహం అయ్యింది. అతను వదిలేయడంతో స్వగ్రామంలోనే ఉంటూ కూలీనాలి చేసి జీవనం సాగిస్తోంది.

చెస్ పోటీల్లో నలుగురికి పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో నగరానికి చెందిన నలుగురు క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇటీవల ఏలూరులో ఏపీ మొదటి చెస్ ర్యాంకింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్-10 ఓపెన్ కేటగిరిలో కాశిత సాయి యశస్ ఐదు రౌండ్లలోనూ తిరుగులేని ఆధిక్యతను చాటి విజేతగా నిలిచాడు. వాసు సాయి మనోజ్ఞకృష్ణ ఐదు రౌండ్లకు గాను నాలుగు రౌండ్ల ఆధిక్యతతో తృతీయ స్థానంలో నిలిచాడు. ఆపేక్షిత సుశృత ఐదు రౌండ్లలో గెలిచి నాలుగో స్థానంలో నిలిచింది. పల్లవినేని మన్విక్ మూడు రౌండ్లలో గెలిచి నాలుగో స్థానంలో నిలిచింది. కోచ్ గుత్తి రవితో పాటు విజేతలను చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవిరాజు అభినందించారు.

పబ్లిక్ నోటీసు

మేము ఇక్కడ వ్రాసిన ("షెడ్యూల్ ప్రాపర్టీస్") షెడ్యూల్‌లో మరింత ప్రత్యేకంగా వివరించిన భూమి యజమానుల శీర్షికను పరిశీలిస్తున్నాము. విక్రయం, బదిలీ, మార్పిడి, అసైన్‌మెంట్, విల్, విడుదల, ఉపసంహరణ, డిక్రీ లేదా ఆర్డర్ ద్వారా షెడ్యూల్ ప్రాపర్టీస్‌లో లేదా దానిలోని ఏదైనా భాగంలో ఏదైనా వ్యక్తి హక్కు, టైటిల్, దావా, ప్రయోజనం, డిమాండ్ లేదా ఆసక్తిని కలిగి ఉంటే లేదా క్లెయిమ్ చేస్తే ఏదైనా న్యాయస్థానం, భారం, తనఖా, లీజు, తాత్కాలిక హక్కు ఛార్జ్, నిర్వహణ, లైసెన్స్, బహుమతి, వారసత్వం, అవిభక్త వాటా, స్వాధీనం, సౌలభ్యం, ట్రస్ట్, ఓకెన్సీ, సబ్ లీజు, అద్దె, ఉప-అద్దె, సెలవు మరియు లైసెన్స్, లిస్ పెండెన్‌లు, సౌలభ్యం, ఎంటీకలు, మొదటి తిరస్కరణ హక్కు లేదా ఏదైనా స్వభావం లేదా ఇతరత్రా లేదా ఎలాగైనా, లేదా ఏదైనా ఒప్పందం కింద, దస్తావేజు, పత్రం లేదా న్యాయవాది యొక్క అధికారం లేదా ఏదైనా అభ్యంతరం/లు ఏ పద్ధతిలో అయినా తెలియజేయడం అవసరం ఈ నోటీసు తేదీ నుండి 7 (ఏడు) రోజులలోపు క్రింద సంతకం చేసిన వారి క్రింద పేర్కొన్న చిరునామాలో దిగువ సంతకం చేసిన వారికి, దానికి మద్దతుగా నోటరీ చేయబడిన/ధృవీకరించబడిన డాక్యుమెంటరీ రుజువు యొక్క నిజమైన కాపీలతో వ్రాతపూర్వకంగా, విఫలమైతే టైటిల్ యొక్క శీర్షిక అని భావించబడుతుంది. షెడ్యూల్ ప్రాపర్టీలు స్పష్టంగా, చెల్లుబాటు అయ్యేవి మరియు విక్రయించదగినవి మరియు షెడ్యూల్ ప్రాపర్టీలపై ఎవరికీ ఎలాంటి హక్కులు, టైటిల్, ఆసక్తి, దావా, డిమాండ్ ఉండవు. సపోర్టింగ్ డాక్యుమెంట్లు లేని ఏవైనా క్లెయిమ్‌లు స్వీకరించబడవు. దయచేసి మీ కవరుపై ఆంధ్ర ప్రదేశ్, శ్రీ సత్యసాయి, మరియు అనంతపురం జిల్లా అని గుర్తు పెట్టండి.

షెడ్యూల్ ప్రాపర్టీలు (భూమి యొక్క వివరణ)

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లా, కనగానపల్లి, కంబదూరు తాలూకా, కె ఎస్ పాళ్యం, పల్లూరు, మద్దలచెరువు, రాళ్లపల్లి, చెన్నంపల్లి గ్రామాలు మరియు మరింత ప్రత్యేకంగా క్రింద వివరించబడిన సుమారు 84.67 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థిరాస్తి యొక్క మొత్తం ముక్క మరియు పార్శిల్:

క్ర. నెం	గ్రామం / మండలం / జిల్లా	ఖాతా నం.	Sy. సంఖ్య.	యజమాని పేరు	మొత్తం పరిధి (ఎకరాలు)
1	మద్దలచెరువు, రాళ్లపల్లి, కె.ఎస్.పాళ్యం, చెన్నంపల్లి, పల్లూరు / కనగానపల్లి, కంబదూరు / శ్రీ సత్యసాయి, అనంతపురం	1689	222-2C & 222-2A	తలారి రాజు	2.20 & 0.50
2		1068	246-7	యాపమను తిప్పన్న	5.00
		1069	246-8	ఆది ఆంధ్రనారాయణ	5.00
3		1837	257-1	చీమల లక్ష్మీదేవి	7.90
4		3322	235-8	రొద్దం లక్ష్మి	5.00
5		3051	258-1C2	యలమంచిలి సరోజమ్మ	3.00
		3445	258-1C2	చల్లా మల్లిక	3.00
6		2775	278-1	తలారి ముత్యాలన్న	3.66
7		3284	366-1A	ఇ.రాజశేఖర్‌రెడ్డి	3.60
8		1806	349-1B/3J	బోయ సుబ్బమ్మ	0.78
9		3531	387-A	కటిక శ్రీనాథ్ యాదవ్	10.91
		843	96	డాలి కామన్న	5.26
10		772	96	డాలి అక్కులప్ప	5.26
11		308	117-5	బోయ మహానాధ	5.00
		496	117-1B	బోయ నరేష్	7.00
		28	117-1B	బోయ నరసింహులు	5.05
12		1271	7-1B-6	బోయ లింగమ్మ	6.55
				మొత్తం	84.67

సం/- **ప్రతాప్ పోగులకొండ**, న్యాయవాది, 8-2-120/86/9.303.3వ అంతస్తు, 8-2-120/86/9.303.3వ అంతస్తు, GK టైమ్స్ స్క్వేర్, ఎదురుగా: పార్క్ హయత్ హోటల్ బంజారా హిల్స్, రోడ్ నెం 2, హైదరాబాద్- 500034, తెలంగాణ, మొబైల్ నెం: 9966807021, 7013212657
Email: vm305239@gmail.com, prataplawofficehyd@gmail.com

సంక్షిప్తం

నేడు 'ఉపాధి' గ్రామ సభలు

అనంతపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2024-25ఆర్థిక సంవత్సరంలో కొత్త పనుల ఎంపిక నిమిత్తం బుధవారం మండలంలోని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ చంద్రకళ తెలిపారు. అనంతపురం రూరల్‌ను కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో ఉపాధి పనులు కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నూతన పనులు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు గ్రామసభల్లో పాల్గొని కొత్త పనులు ఎంపిక చేయాలన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అనంతపురం విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య స్కూల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఏజీఎం సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. మనం చేసే చిన్న రక్తదానం ఎందరో ప్రాణాలను కాపాడుతుందన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల్లో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, ఇతర సిబ్బంది, ఇలా ప్రతి ఒక్కరూ హాజరై రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

బ్యాక్‌రెస్ట్ పరికరాల వితరణ

అనంతపురం కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రికి అమ్మ సంస్థ ఆధ్వర్యంలో రోగుల కోసం బ్యాక్ రెస్ట్ పరికరాలు వితరణ చేశారు. ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగంలో రోగులకు వినియోగించేందుకు రూ.15వేలు విలువ చేసే 14 పరికరాలను మంగళవారం అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతను అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి కలిసి వాటిని అందజేశారు.

నియామకం


సత్రసాల మంజునాథ్

అనంతపురం కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జిల్లాకు చెందిన సత్రసాల మంజునాథ్ నియమితులయ్యారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ నేతృత్వంలో కార్యవర్గ సభ్యుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురం నగరానికి చెందిన సత్రసాల మంజునాథ్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆయనను రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అభినందించారు.

ఐఎంఎం సేవలు అభినందనీయం


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహబూబ్‌బాషా

అనంతపురం కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా ఐఎంఎం ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. నగరంలోని పీటీసీ అతిథి గృహంలో మంగళవారం హోం మంత్రి వంగలపూడి అనితను ఐఎంఎం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహబూబ్‌బాషా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్గనైజేషన్ సేవలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


సాకేహరితో మాట్లాడుతున్న హోంమంత్రి

అనంతపురం సెంట్రల్, నవబంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దళిత, గిరిజన వర్గాల ప్రజలపై దాడులను అరికట్టేందుకు కేసులను విచారించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి కోరారు. డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు వచ్చిన మంత్రిని ఆయన మంగళవారం కలిసి అట్రాసిటీ కేసులు, దాడులు, హత్యలు తదిర ఘటనలపై వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు ఓబులేసు, హరి, రాము, దిలీప్, యల్లప్ప, నాగేంద్ర, వెంకటేశు, రామాంజనేయులు, బాలనాగేంద్ర పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని సనప పంచాయతీ కార్యదర్శి కమల కరుణాకర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీపీఓ నాగరాజునాయుడు తెలిపారు. పంచాయతీలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, దీనికి తోడు స్థానిక కార్యదర్శి అందుబాటులో లేకపోవ డాన్ని గుర్తించామన్నారు. అనుమతి లేకుండా విధులకు రాకపోవడం, పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించడంతో క్రమశిక్షణాచర్యల్లో భాగంగా షోకాజ్ నోటీసు జారీచేసినట్లు డీపీఓ పేర్కొన్నారు.

హోంమంత్రికి ఆత్మీయ పలకరింపులు

● పలువురు ఎమ్మెల్యేలు, నాయకుల ఇళ్లకు వెళ్లిన అనిత


హోంమంత్రితో ప్రభాకర్‌చౌదరి, కుటుంబసభ్యులు


సత్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, కుటుంబసభ్యులు

అనంతపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోంశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా జిల్లాకు వచ్చిన వంగలపూడి అనితకు టీడీపీ పలువురు ఎమ్మెల్యేలు ఆత్మీయత చూపారు. జిల్లా కేంద్రంలో నివాసముంటున్న పలువురు ఎమ్మెల్యేల ఆహ్వానం మేరకు హోంమంత్రి అనిత వారివారి నివాసాలకు వెళ్లి ఆత్మీయతతో పాటు సత్కారాన్ని అందుకున్నారు. పోలీసుశిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావడంలో భాగంగా... హోం మంత్రి సోమవారం రాత్రి అనంతపురానికి చేరుకున్నారు. హోంమంత్రి అనితకు ఆ పార్టీ ముఖ్య నేతలు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి ఆహ్వానం మేరకు ఆమె ఆయన నివాసానికి వెళ్లారు. పెద్ద ఎత్తున వైకుంఠం ప్రభాకర్ చౌదరి వర్గీయులు, పార్టీ నాయకులు, కుటుంబసభ్యులు హోంమంత్రి అనితకు పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. పార్టీ నాయకులు, వైకుంఠం కుటుంబ సభ్యులతో కలిసి హోంమంత్రి అల్పాహారం తీసుకున్నారు. వైకుంఠం ప్రభాకర్ చౌదరి కుటుంబసభ్యులు హోంమంత్రికి చిరుసత్కారం అందజేశారు. అనంతరం మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు ఎంఎస్ రాజు నివాసానికి వెళ్లిన మంత్రికి ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇంట్లో డిన్నర్ ముగించుకున్న అనంతరం హోంమంత్రిని రాజు దంపతులు ఇంటి ఆడపడుచుగా సారె, చీరతో సత్కరించి ఆత్మీయతను చాటుకున్నారు. మంగళవారం ఉదయం డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ ముగించుకున్న అనంతరం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ నివాసానికి మంత్రి వెళ్లారు. హోంమంత్రికి ఎమ్మెల్యేతో పాటు ఆమె తనయుడు శ్రీరామ్, పార్టీ నా యకులు ఆత్మీయ ఆహ్వానం పలికారు. తేనీరు తీసు కున్న తరువాత చిరుసత్కారాన్ని అందజేశారు. అనంతరం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ నివాసానికి వెళ్లిన హోంమంత్రి అనితకు భారీ గజమాలతో ఆయన కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఇంటి ఆడపడుచుగా సారె, చీరతో ఎమ్మెల్యే దంపతులు హోం మంత్రిని సత్కరించారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లిన హోంమంత్రికి జేసీ ప్రభాకర్‌రెడ్డి, అస్మిత్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. హోంమంత్రికి తండ్రీ, కొడుకులు ఆత్మీయ సత్కారం అందజేశారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నివాసానికి వెళ్లిన హోంమంత్రికి శ్రావణిశ్రీ కుటుంబసభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శ్రావణి నివాసంలో తేనేరు తీసుకున్న అనంతరం హోంమంత్రిని ఘనంగా సన్మానించారు. ఒక్కమాటలో చెప్పాలంటే... తొలిసారిగా జిల్లాకొచ్చిన హోంమంత్రిని ఆ పార్టీ ఎమ్మెల్యేలు వారి ఇంటి ఆడప డుచుగా ఆదరించారనడంలో ఎలాంటి సందేహం లేదు.


హోంమంత్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ


సత్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

రాప్తాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. నియోజకవర్గానికి చెందిన 10 మందికి మంగళవారం అనంతపురం నగరంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌బాధితులకు అందజేశారు. రాప్తాడు మండలం జన్మభూమి నగర్‌కు చెందిన బెస్త శంకర్‌కు రూ. 55 వేలు, గాండ్లపర్తికి చెందిన గడ్డం రాజశేఖర్‌కు రూ. 85 వేలు, బండమీదపల్లికి చెందిన నల్లక్కగారి కాటమయ్యకు రూ. 27 వేలు, కనగానపల్లికి చెందిన రామ్మూర్తికి రూ. 88 వేలు, భరత్‌కుమార్‌కు రూ. 32 వేలు, అనంతపురం రూరల్ మండల విద్యారణ్య నగర్‌కు చెందిన మన్నుల శ్రుతికి రూ. 94వేలు, రుద్రంపేటకు చెందిన ప్రతాప్‌కు రూ. 29 వేలు, ఆత్మకూరు మండలం తలుపూరుకు చెందిన గొసల పెద్దిరెడ్డికి రూ. 75 వేలు, యాలేరుకు చెందిన హరిజన శారదకు రూ. 1.58 లక్షలు, తలుపూరుకు చెందిన కట్టకింద గోపాల్‌కు రూ. 30 వేలు చెక్కులు అందచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై 104 ఉద్యోగుల వినతి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది మండల వైద్యాధికారి రవీనాయక్‌కు స్థానిక ఎన్ఎస్‌గేటు ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. మూడు నెలల వేతనాలు ఇవ్వలేదని, యాజమాన్యం నుంచి రావాల్సిన ఇతర బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయంచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో 104 సంఘం జిల్లా ప్రదానకార్యదర్శిమోహన్‌బాబు, డ్రైవర్ గణేశ్, డీఈఓ సాయికుమార్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

● రామగిరి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది మండల వైద్యాధికారి సరితకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో 104 సంఘం జిల్లా ప్రదానకార్యదర్శిమోహన్‌బాబు, డ్రైవర్లు బాబాబుడెన్, డీఈఓ అక్కులప్ప పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్-14 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు పతకాలు వచ్చాయి. మూడు రోజుల పాటు నరసరావుపేటలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-14 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు మంగళ వారం ముగిశాయి. ఇందులో జిల్లాకు చెందిన కౌశిక్, సంతోష్, సాత్విక్ ఈ నెల 18వతేదీ నుంచి చత్తీస్‌ఘర్‌లో నిర్వహించే 68వ ఎస్‌జీఎఫ్ నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఏపీ రాష్ట్రం జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. విజేతలను జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి, కోచ్‌లు వంశీ, వెంకటేష్ అభినందించారు.

ఇదిగో స్వామీ.. కానుక



గార్లదిన్నె, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి రూ.రెండు లక్షలకు పైగా విలువైన బంగారం పులిగోరు హారాన్ని భక్తులు మంగళవారం సమర్పించారు. మండలంలోని సంజీవపురానికి చెందిన మల్లెంపూటి జయన్న, విజయలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకుని బంగారం హారాన్ని సమర్పించి, మొక్కు తీర్చుకున్నారు.

నాణ్యతలో రాజీ వద్దు : డ్వామా పీడీ

గార్లదిన్నె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల నిర్మాణంలో ఎక్కడ రాజీపడ వద్దని డ్వామా పీడ సలీం బాషా పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో రూ. 70వేలతో నిర్మిస్తున్న రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను డ్వామా పీడీ మంగళవారం పరిశీలించారు. అనంతరం గార్లదిన్నెలో రైతు సత్యవతమ్మ నిర్మిస్తున్న గోకుల షెడ్‌ను, ముకుందాపురం, కొప్పలకొండ గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, ఫారం పాండ్ పనులను పరిశీలించారు. అదేవిధంగా ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఇంటివద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ నాంచారమ్మ, ఈసీ విజయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శానిటేషన్ డ్రైవ్‌పై దృష్టి పెట్టండి : డీపీఓ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అమలవుతున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ అమలులో భాగంగా కొన్ని పంచాయతీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి పలు సూచనలు చేసిన పంచాయతీ కార్యదర్శుల్లో మాత్రం మార్పు కనిపిండం లేదని డీపీఓ నాగరాజునాయుడు పేర్కొన్నారు. మార్పు లేదంటే ఇబ్బందులు తప్పవని మంగళవారం హెచ్చరించారు. ఇప్పటికే పలువురుకి సోకాజ్ నోటీసలు జారీ చేసినా కొందరిలో మార్పు లేదన్నారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా తమ బాధ్యతలను నిర్వర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేఎస్ఎన్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. కళ్యాణదుర్గం రూరల్ మండలం శీబాయి గ్రామానికి చెందిన అశ్రిత నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ బీఏ ఎకనామిక్స్ చదువుతోంది. ఈ నెల 1వ తేదీన కళాశాలకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరింది. అదే రోజు ఆమె తండ్రి బసవరాజు ఫీజు కట్టడానికి వస్తే కళాశాలకు రాలేదన్నారు. సాయంత్రం వరకు అక్కడే ఉన్నా రాలేదు. దీంతో తండ్రి బంధువుల ఇళ్లల్లో ఆరా తీశారు. ఆ చూకీ తెలియకపోవడంతో మంగళవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇద్దరికి జైలు శిక్ష

అనంతపురం క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మరణాయుధాలు కలిగి ఆర్మ్స్ ఆక్ట్ కేసులో ఉన్న ఇద్దరు ముద్దాయిలకు ఏడాదిన్నర జైలు శిక్ష పడింది. 2010లో సిండికేట్‌నగర్‌కు చెందిన వడ్డే పెద్దన్న, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లికి చెంది పత్తిపాటి గంగన్నను అప్పటి టూటౌన్ సీఐ ఎ. శ్రీనివాసులు సుమోటో కేసు కింద అరెస్ట్ చేశారు. వారిలో వడ్డే వెంకట్ నుంచి డీబీబీఎల్ తుపాకి, గంగన్న నుంచి ఎస్‌బీబీఎల్ తుపాకి, ఆరు లైవ్ కాట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై చార్జిషీట్ నమోదు చేశారు. మంగళవారం ఐఏజేసీఎం ఏడీఎం కోర్టు జడ్జి ప్రతిభ వారికి ఏడాదిన్నర జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు.

జూనియర్ మెడికోలకు క్రీడాపోటీలు

అనంతపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవిన్య పేరుతో నిర్వహించే ఫ్రెషర్స్‌డే సందర్భంగా 2024 మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ మెడికోలకు మంగళవారం స్థానిక సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న మెడికల్ కళాశాల క్రీడాప్రాంగణంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ నవీన్, డాక్టర్ తెలుగు మధుసూదన్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న పల్లె రూపు రేఖలు

● గ్రామాల్లో సాగుతున్న సీసీ రోడ్ల పనులు
● హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు


గొందిరెడ్డిపల్లిలో పూర్తి అయిన సీసీ రోడ్డు

రాప్తాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పంచాయతీల అభివృద్ధికి నిధులు లేక పోవడంతో గ్రామాలు వెలవెలబోయాయి. ఆ ఐదేళ్లలో తూతూ మంత్రంగా గ్రామాల్లో సీసీ రోడ్లు వేసి మమ అనిపించారు. అయితే టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే పల్లెల రూపు రేఖలు మారుతున్నాయి. గ్రామాల్లో సీ సీ రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేయడంతో ఇప్పటికే పనులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడంతో వైసీపీ సర్పంచులు కూడా అప్పట్లో అసహనం వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించారు. గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ద్వారా భారీ మొత్తంలో నిధు లు మంజూరు చేశారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు పూర్తి చేశారు. మిగతా గ్రామాల్లో పనులు చేసున్నారు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ గ్రామాల్లోనే... పనులు: రాప్తాడు మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మొదటి విడుతలో రూ. 2 కోట్లు నిధులు మంజూరయ్యాయి. మండలంలోని బండమీదపల్లి, వరిమడుగు, రామినేపల్లి, ముస్లిం మైనార్టీ కాలనీ, (రాప్తాడు పంచాయతీ), చిన్మయ్‌నగర్ (ప్రసన్నాయ పల్లి పంచాయతీ), యర్రగుంట, హంపాపురం, గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు, మరూరు, ఎం చెర్లోపల్లిలో నూతనంగా సీసీ రోడ్లు నిర్మించను న్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కొన్ని గ్రామాల్లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించగా, వేగంగా జరుగుతున్నాయి.

మైనార్టీ కాలనీలో రోడ్లకు మోక్షం



ఐదేళ్ల వైసీపీ పాలనలో రా ప్తాడు పంచాయతీ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీలో వంద మీటర్లు కూడా సీసీ రోడ్డు వే యలేదు. టీడీపీ కూటమి అధి కారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో సీసీ రోడ్ల నిర్మాణా నికి రూ. 44 లక్షలు నిధులు మంజూరు చేయించారు.

- తిరుపాలు, సర్పంచ్, రాప్తాడు

సీసీ రోడ్డు నిర్మించారు



కొన్నేళ్ల నుంచి మా వీధిలో సీసీ రోడ్డు లేక ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారు. గుంతల దారిలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగేది. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి జారి పడేవారు. ప్రస్తుతం మా వీధిలో సీసీ రోడ్డు వేయడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నాగభూషణ, చిన్మయ్‌నగర్

హామీలు నెరవేరుస్తున్నారు



టీడీపీ అధికారంలోకి వస్తే గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆ పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సీసీ రోడ్లు నిర్మించి సౌకర్యాలు కల్పించడం ఎంతో అభినందనీయం.

- బాలు, గొందిరెడ్డిపల్లి

వేగంగా పూర్తి చేస్తాం

రాప్తాడు మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా గ్రామాల్లో పనులు చేస్తున్నారు. పనులను నాణ్యంగా, వేగంగా పూర్తి చేస్తాం.

- కిషోర్ కుమార్, పీఆర్ ఏఈఈ

మరో మూడు నగర వనాలు

● కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదబాయి

అనంతపురం న్యూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మరో మూడు (పెనుకొండ, అమగొండ పాల్యం, బత్రేపల్లిల్లో) నగర వనాలు ఏర్పాటు చేయనున్నట్లు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదబాయి తెలిపారు. ఆమె మంగళవారం అటవీశాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో పలు శాఖ పరమైన అంశాలను వివరించారు. ఈ సంవత్సరం నూతనంగా ఎన్ఆర్‌జీఎస్ పథకం ప్రారంభమైందని, అందులో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పై ఇప్పటికే సిబ్బందికి పలు సూచనలు చేశామని శిక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. దీంతో పాటు ఇప్ప టికే నర్సరీల అభివృద్ధికి జూలైలోనే గ్రౌండింగ్ పనులు చేపట్టామన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి : డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : డిపార్ట్‌మెంట్ పరంగా చేపట్టే పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు రికార్డులు నమోదు చేసి, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ ఆనంద్ సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం జిల్లా అటవీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అందులో బాగంగా టీఓ గిరిబాబు వద్ద పలు రికార్డులు పరిశీలించారు. రికార్డుల నమోదులో ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు.

ఖైదీలను విడుదల చేయాలి

● హోంమంత్రికి సీపీఐ నాయకుల వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలను రిపబ్లిక్ డే సందర్భంగా విడుదల చేయాలని సీపీఐ నాయకులు హోంమంత్రి అనితను కోరారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులు మంగళవారం హోంమంత్రిని కలిశారు. వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా చాలా మంది ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్ష అనుభవిస్తున్నారన్నారు. వారికి క్షమాభిక్ష కోసం వారి కుటుంబీకులు ఆశగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. గతంలో సీఎం చంద్రబాబు 1995 నుంచి 2019 వరకూ అనేక జీవోలు విడుదల చేసి చాలా మంది ఖైదీలకు క్షమాభిక్ష వచ్చేలా చేశారని తెలిపారు. 2025 జనవరి 26న ఖైదీలకు క్షమాభిక్ష వచ్చేలా చూడాలని మంత్రికి వినతిపత్రం అందించారు.

ఏ, డీ జట్ల గెలుపు

● రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ పోటీల్లో దేవ్‌ప్రమోద్ డబుల్ సెంచరీల మోత


రోషన్


తోషిత్ యాదవ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాబబుల్ పోటీల్లో టీం ఏ, టీం డీ జట్లు గెలుపొందాయి. డీ జట్టు ఆటగాడు దేవ్ ప్రమోద్ ఒకేమ్యాచ్‌లో రెండు డబుల్ సెంచరీలతో రికార్డు సాధించాడు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అండర్-16 రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ పోటీలు నిర్వహిచారు. ఏసీఏ-ఏ జట్టు, ఏసీఏ-బి జట్ల మధ్య పోటీ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన టీం ఏ జట్టు 77ఓవర్లలో 266పరుగులకు ఆలౌట్ అయ్యింది. బి జట్టు బౌలర్ మహిత్ 5వికెట్లు పడగొట్టాడు. ఏసీఏ-బీ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 68.3ఓవర్లలో 215పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో భాను శ్రీ హర్ష 90 పరుగులు సాధించాడు. రెండో ఇన్నింగ్స్ జిల్లా ఏ జట్టు 55 ఓవర్లలో 7వికెట్లకు 217పరుగులు చేసింది. రోషన్ 117 పరుగులు చేశాడు. టీం బీ బౌలర్ తోషిత్ యాదవ్ 5వికెట్లు పడగొట్టాడు. దీంతో టీం ఏ జట్టు 208పరుగుల తేడాతో విజయం సాధించింది.

దేవ్ ప్రమోద్ రికార్డు


దేవ్ ప్రమోద్

మరో మ్యాచ్‌లో ఏసీఏ-సీ జట్టు, ఏసీఏ-డీ జట్లు పోటీ పడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన డీ జట్టు 77ఓవర్లలో 346పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందులో దేవ్ ప్రమోద్ 215 పరుగులు సాధించాడు. టీఎం సీ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 52.2ఓవర్లలో 139పరుగులకు ఆలౌట్ అయ్యింది. టీం డీ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6వికెట్లకు 360పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఇందులో దేవ్ ప్రమోద్ మరోసారి డబుల్ సెంచరీ బాదాడు. రెండో ఇన్నింగ్స్‌లో టీం సీ జట్టు 45ఓవర్లలో 121పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో టీం డి జట్టు 445పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి, సెలెక్షన్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కోటా రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు 'నారాయణ' విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ఏజీఎం, ప్రిన్సిపాల్

అనంతపురం విద్య, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జీసస్ నగర్ లోని నారాయణ స్కూల్ విద్యార్థికి ఎంపికైనట్లు స్కూల్ ఏజీఎం రామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగరాజేశ్వరి మంగళవారం తెలిపారు. ఆ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ 63 కేజీల విభాగంలో తమ పాఠశాల విద్యార్థి హరిచరణ్ తేజ్ ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడన్నారు. ఈ నెల ఏడు నుంచి 13వ తేదీ వరకూ మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని పేర్కొన్నారు.

థ్యాంక్యు సీఎం సార్..!

● క్రీడా పాలసీ పట్ల హర్షం



థ్యాంక్యూ సీఎం సార్ అంటున్న క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగానికి మహర్దశ, క్రీడాకారులకు వరాలు కురిపించే క్రీడా పాలసీ తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడా సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన క్రీడా పాలసీకి మద్దతుగా మంగళవారం సాయంత్రం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్రత్యేక కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నరేంద్రచౌదరి మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7కోట్లు నజరానా ప్రకటించడం అభినందనీయమన్నారు. ఆసియా, జాతీయ క్రీడలు, ఇతర పోటీల్లో పతకాలు సాధించిన విజేతలకు భారీగా ప్రోత్సాహకాలు అందజేయడం శుభసూచికమన్నారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 3శాతానికి పెంపు హర్షణీయమన్నారు. క్రీడాకారుల పట్ల, క్రీడారంగం పట్ల సీఎం చంద్రబాబుకు ఉన్న నిబద్ధతకు నూతన క్రీడా పాలసీ అద్దం పడుతుందని కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ షఫీ, సభ్యులు రామాంజనేయులు, రాకేష్, సీనియర్ కోచ్ వెంకటేశ్వర్లు, దేవమణి, కోచ్‌లు నరేష్, వంశీ, సంధ్య, లక్ష్మి, శివకుమార్, హుస్సేన్‌ఖాన్, పీడీలు వెంకటేశులు, గోపాల్‌రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

పామిడి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 13, 14వ వార్డులలో మంగళవారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి ఆ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మాజీ కౌన్సిలర్ చెన్నవరం మహబూబ్ బాషా, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, నాయకులు వెంకటరెడ్డి, పురుషోత్తం, చిరంజీవి, ఐటీడీపీ ప్రతినిధి శివఅభిరాం తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలో టీడీపీ సభ్యత్వ నమోదు పార్టీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్ నాయక్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

గుత్తి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం చలో కలెక్టరేట్ జరపనున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ పిలుపునిచ్చారు. పట్టణంలో ఓ కళాశాలలో మంగళవారం ఆయన విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వసతి దీవెన, విద్యాదీవెన రూ. 3480కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు చేపట్టనున్న చలో కలెక్టరేట్‌కు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ధనుంజయ, నాయకులు రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

కణేకల్లు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో అంగన్‌వాడీ ఆయాలుగా కొత్తగా నియామకమైన ముగ్గురికి మంగళవారం నియామక పత్రాలను అందజేసినట్లు ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. హనకనహాళ్-3 కేంద్రానికి గౌతమి, కొత్తపల్లికి ఈశ్వరమ్మ, ఏళంజికు నింగమ్మలను ఆయాలుగా నియమించడంతో వారికి నియామకపత్రాలను అందజేసినట్లు చెప్పారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

డీ.హీరేహాళ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శివారు ప్రాంతంలో పేకాట కేంద్రంపై మంగళవారం దాడులు చేసి 13 పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ వెంకటరమణప్ప తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని, అలాగే వారి నుంచి రూ.26,100 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

97 మద్యం బాటిళ్లు స్వాధీనం

యల్లనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవండ్లపల్లి, వాసాపురం గ్రామాలకు చెందిన శివకేశవ, సురేష్ నుంచి మంగళవారం 97మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు. యల్లనూరులోని మద్యం షాపు నుంచి వారు మంగళవారం సాయంత్రం మద్యం తీసుకువెళుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. కోడిమూర్తి సమీపంలో పట్టుకుని అరెస్టు చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

10న విద్యార్థులకు పోటీలు

కుందుర్పి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయడానికి సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన పిల్లల పండుగ పేరుతో మండల స్థాయిలో పోటీలను నిర్వహించనున్నామని ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్కే లెనిన్‌బాబు మంగళవారం తెలిపారు. 1 నుంచి 6వ తరగతి వరకు జూనియర్స్ విభాగంగా, 7 నుంచి పదో తరగతి వరకు సీనియర్స్ విభాగంగా విభజించి దేశభక్తి , పర్యావరణంపై పాటలు, పద్యాలు, చిత్రలేఖనం, మట్టి బొమ్మల తయారీ, కథలు చెప్పడం లాంటి అంశాలపై పోటీలు జరుపుతామన్నారు. కుందుర్పి జెడ్పీ హైస్కూల్లో పదో తేదీన ఉదయం 10 గంటలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు 7989593455, 8328063844కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వలసల నివారణకు ఉపాధి పనుల కల్పన

యాడికి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): యాడికి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో కూలీల వలసలను నివారించడం కోసం ఉపాధి పనులు కల్పించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనులను గుర్తించడం కోసం బుధవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పనులను గుర్తించి దినసరి కూలీలకు పనులు కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నామని, కరువు మండలంలోని కూలీలు వలసలు పోకుండా పనులను కల్పించి వారికి ఉపాధి కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

సుంకులమ్మ ఆలయంలో చోరీ

గుంతకల్లుటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామ సుంకులమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయంలోకి సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి హుండీని పగలగొట్టి అందులోని డబ్బులను ఎత్తుకెళ్లారు. సుమారు రూ. 30వేలు చోరీకి గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాలను అరికట్టండి: బీఎస్పీ

పామిడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రియల్ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, అలాగే ఇసుక, ఎర్రమట్టి అక్రమ తరలింపును అరికట్టాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన నాయకులతో కలిసి తహసీల్దార్ శ్రీధరమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా లే అవుట్లు వేసి, రియల్ ఎస్టేట్ చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారి ఆగడాలను అరికట్టాలన్నారు. ఇక పెన్నానది నుంచి ఇసుకను, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎర్రమట్టిని పెద్దఎత్తున టిప్పర్లతో అక్రమంగా తరలిస్తున్నారని, వాటిని ఆపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఓబులేసు, మండల అధ్యక్షుడు నారాయణమూర్తి నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

యాడికి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా వెంకటరమణయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం వీఆర్ నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. యాడికి పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ అయ్యాక గురుప్రసాద్‌రెడ్డి ఎస్ఐగా పనిచేశారు. ఆయన బదిలీ తర్వాత 11నెలలుగా ఎస్ఐ స్థానం ఖాళీగానే ఉంది. ప్రస్తుతం వెంకటరమణయ్య బాధ్యతలు స్వీకరించారు.

వేతనాలను వెంటనే చెల్లించాలి

రాయదుర్గం రూరల్/ బ్రహ్మసముద్రం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ వైద్యఆరోగ్యశాఖలో పని చేస్తున్న 104 సిబ్బంది మంగళవారం ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడు నెలల వేతనాన్ని చెల్లించకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. బ్రహ్మసముద్రంలోని 104 సిబ్బంది కూడా వైద్యాధికారి అఫ్తాబ్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రమాదకరంగా హోర్డింగులు



ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్

- గాలికి ఊగుతున్న వైనం
- ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు


పిల్లర్ లేకుండా పైపు ఆధారంగా హోర్డింగ్ స్తంభం

రాయదుర్గం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల ప్రచారం కోసం ఏర్పాటు చేసిన హోర్డింగులతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇప్పటికే రాయదుర్గం పట్టణంలో భారీ ఎత్తున రెండు హోర్డింగులను ఇనుప చువ్వలతో ఏర్పాటు చేశారు. ఆ హోర్డింగులకు కింద పిల్లర్లు లేకుండా వేయడంతో పాటు నాసిరకంగా ఏర్పాటు చేసిన కారణంగా గాలికి అటు ఇటు ఊగుతున్నాయి. సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలలో నిత్యం విద్యుత్ సరఫరా ఉంటుంది. ప్రమాదవశాత్తు హోర్డింగ్ ఏ మాత్రం నేలకు ఒరిగినా నేరుగా తీగలపై పడే అవకాశం ఉంది. పైగా అటు ఇటు ఊగుతుండడంతో ప్రజలు కూడా భయానికి లోనవుతున్నారు. రోడ్డుపై నిత్యం రద్దీగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో హోర్డింగులకు సమీపంలో రాగానే చోదకులు దృష్టి అంతా దానిపైనే ఉంచే పరిస్థితి. ప్రమాదం పొంచి ఉందనే విషయం అధికారులకు తెలిసినప్పటికీ వాటిని తొలగించడంలో ఏ మాత్రం చొరవ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అటు జూనియర్ కళాశాల క్రీడా మైదానం వద్ద, ఇటు ఎంపీడీ ఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ హో ర్డింగులు ప్రమాదకరంగా ఉన్నాయని ఇప్పటికే స్థానికులు అధికారులకు ఫిర్యా దు చేశారు. తూతూ మంత్రంగా కొంత సి మెంట్ వేసి దానిని కాపాడుకునే ప్రయ త్నం చేశారు. హో ర్డింగులు మాత్రం హోరు గాలి ధాటికి నిలబడే పరిస్థితి ఉండదని, ఎప్పటికైనా ప్రమాదం తప్పదనే గ్రహించి అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ: ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని 1వ వార్డులో అంబేడ్కర్ భవన్ వద్ద మంగళవారం రాత్రి ఆయన పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూసే పార్టీ టీడీపీనేనన్నారు. సభ్యత్వం ఉంటే కార్యకర్త కుటుంబానికి పార్టీ కొండంత ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందితే రూ. 5 లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందని చెప్పారు. అలాగే కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వీలైనంత ఎక్కువ మంది సభ్యత్వం పొందేలా చూడాలని వార్డు ఇన్చార్జి, కౌన్సిలర్లకు సూచించారు. అనంతరం జై భీం పార్టీ నాయకురాలు బేపార్ గౌసియా, మున్సిపల్ రిటైర్డ్ అధికారి రామాంజనేయులు టీడీపీలోకి చేరగా.. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జయరాం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీకి కార్యకర్తలే బలం అన్నారు. కార్యకర్తలకు భరోసా కల్పించాలని అధిష్టానం సభ్యత్వ నమోదు చేపట్టిందని తెలిపారు. ప్రతిఒక్కరూ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని కార్యకర్తలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు ఈశ్వర్, పట్టణ, మండల అధ్యక్షులు ఎంకే చౌదరి, బద్రివలి, కార్యకర్తలు పాల్గొన్నారు.


జైభీం నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థిని జ్యోత్స్నకు అవార్డు ప్రదానం


హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న జ్యోత్స్న

గుంతకల్లుటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ తిమ్మాపురం గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పీ.జ్యోత్స్న వనరక్షణ అనే ఉత్తమ కథకు ఎంపిక కావడంతో అవార్డును అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం మాచిరాజు బాల సాహిత్యపీఠం ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారని, అందులో మాచిరాజు బాల సాహిత్య వ్యవస్థాపకుడు మాచిరాజు కామేశ్వరరావు, విశ్రాంత ప్రొఫెసర్ మృణాళిని జ్యోత్స్నకు జ్ఞాపికతోపాటు, అవార్డును అందజేశారని అన్నారు. అలాగే ఈ కథల పోటీలో పాల్గొన్న మరో నలుగురు విద్యార్థులకు కూడా ప్రశంసా పత్రాలను అందజేసినట్లు చెప్పారు.

రాజ్యపురస్కారానికి రామసాగరం విద్యార్థి


ధనుష్

బెళుగుప్ప, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామసాగరం ఉన్నత పాఠశాల విద్యార్థి ధనుష్ రాజ్యపురస్కారానికి ఎంపికైనట్లు స్కౌట్ అండ్ గైడ్స్ మాస్టర్ భాస్కర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల పూలకుంటలో నిర్వహించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో ఈ విద్యార్థి ప్రతిభను కనబరచి ఈ పురస్కారానికి ఎంపికయ్యారని అన్నారు. ఈ నెల 7వ తేదీన విజయవాడలో గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నట్లు చెప్పారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో టీచర్లు

గుత్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఉషారాణి తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జ్యోత్స్న, పదో తరగతి విద్యార్థిని జ్యోతిలక్ష్మి జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. గుంటూరు జిల్లా నరసారావుపేటలో బుధవారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ విద్యార్థినులను మంగళవారం పీడీలు సరోజ, శకుంతలమ్మ, శ్యామల అభినందించారు.

ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి..


పవన్‌కుమార్

గుంతకల్లుటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ కంప్యూటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి యూ పవన్‌కుమార్ ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య మంగళవారం తెలిపారు. ఎస్కే యూనివర్శిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రంలోని బాంద్రాలో ఈనెల 8నుంచి 14వ తేదీ వరకు జరిగే ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతా శిబిరానికి వివిధ కళాశాలల నుంచి పది మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. పవన్‌కుమార్‌కు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారులు అభినందనలు తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం డీఎస్పీ రవిబాబు ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటో నడిపే ప్రతిఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ తప్పక ఉండాలన్నారు. ఆటో కూడా ఆల్ ఓకే కలిగి ఉండాలన్నారు. వాహనం నడిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటోకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. పట్టణ సీఐ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి పథకాలకు నిధులు కేటాయించాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి పథకాలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.7వేల కోట్లు నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను పట్టణంలో మంగళవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. తుంగభద్ర ఎగువ కాలువల ఆధునికీకరణ చేయాలన్నారు. తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లను ఏర్పాటు చేయాలన్నారు. జీడిపల్లి నుంచి మొదలు పెట్టిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. పీఏబీఆర్ కుడికాలువకు సాగునీరివ్వాలని, పిల్లకాలువల నిర్మాణం వెంటనే పూర్తి చేయలని, రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి మండలంలోని చెరువులు, కుంటలను నీటితో నింపాలని, రైతులకు సాగు నీరు, గ్రామాల్లో తాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకేనాగరాజు, వైటీసీ రమేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి కోసం, తుంగభద్ర ఎగువ కాలవ ఆధునికీకరణ పనులకు రాష్ట్రబడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే కాలవశ్రీనివాసులు వ్యక్తిగత సహాయకుడికి ఆయన ఈమేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పనులు, హంద్రీనీవా కాలువ వెడల్పు చేసేందుకు నిధులు కేటాయింపునకు జిల్లాలోని ఎమ్మెల్యేలు బడ్జెట్ సమావేశంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయాలి

ఉరవకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు ఆంజనేయులు, వెంకటేష్ నాయక్, మంజునాథ్, హారుణ్‌రషీద్, రాజేష్, లెనిన్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక


వందన

బొమ్మనహాళ్ , నవంబరు 5(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 8 వతరగతి విద్యార్థిని వందన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రవిప్రసాద్, పీఈటీలు హలిమా, కృష్ణ తెలిపారు. వన్నళ్లి గ్రామానికి చెందిన వందన ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఆ విద్యార్థినిని టీడీపీ నాయకులు కేశప్ప, వన్నూరుస్వామి, విద్యాకమిటీ చైర్మన్ గురుస్వామి మంగళవారం అభినందించారు.

నాటుసారా ఊట ధ్వంసం

ఉరవకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండా, కమలపాడు గ్రామాల్లోని నాటుసారా తయారీ స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. గ్రామాల సరిహద్దుల్లో నాటుసారా కాస్తుండగా.. దాడులు చేసి అందులో 1200లీటర్ల నాటుసారా ఊటలను ధ్వంసం చేశామని, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు శివసాగర్, అన్నపూర్ణ తెలిపారు. ఈ దాడుల్లో ఈఎస్ టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జయనాథ్ రెడ్డి పాల్గొన్నారు..

ఉపాధ్యాయులపై 'అపార్' ఒత్తిడి తగదు: ఎస్టీయూ

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ నమోదు ప్రక్రియలో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం తగదని, వాటి కార్డుల జారీ కోసం ఆధార్ సవరణ కేంద్రాలను జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం వారు ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతన విద్యావిధానంలో భాగంగా ఒకే దేశం, ఒకే ఐడెంటిటీ పేరుతో దేశ వ్యాప్తంగా విద్యార్థులకు ఐడీ క్రియేట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం అపార్ కార్డులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందుకు విద్యార్థుల పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ నంబర్, అడ్మిషన్ రిజిస్టర్ యూ డైస్‌లో ఒకేలా ఉన్నప్పుడే ఐడీ క్రియేట్ అవుతుందన్నారు. అయితే ప్రతి పాఠశాలలో మెజారిటీ విద్యార్థులకు వివరాలు సరిపోలడం లేదని, వాటిని సవరించుకోవడానికి ఆధార్ సవరణ కేంద్రాలు అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. ఈ క్రమంలో అపార్ ఐడీ నమోదుతో ఉపాధ్యాయులకు ఒత్తిడి పెరుగుతోందన్నారు. నెల రోజులుగా వారు ఈ ప్రక్రియతో తిప్పలు పడుతున్నారన్నారు. మరోవైపు ఎస్ఏ ఎంపీ 2 పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులపై అపార్ నమోదు వేగవంతం చేయాలని ఒత్తిడి తీసుకురావడం తగదని అన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ఆధార్ సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, యూడైస్‌లో సవరణలను పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయుల ద్వారా సవరించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. అపార్ నమోదు గడువు పెంచాలని, సరైన ఆధారాలతో అడ్మిషన్ రిజిస్టర్లో వివరాలు సవరించుకోవడానికి అవకాశం కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు చేస్తున్న ఎస్టీయూ నాయకులు

మహిళలు స్వశక్తితో ఎదగాలి: జేసీపీఆర్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ఎదగాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మహిళా సంఘాలు, డిజైనింగ్, మ్యాచింగ్‌సెంటర్, బ్యూటీపార్లర్, సిల్క్‌హౌస్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే ఆ కుటుంబం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు అనుకుంటే సాధించలేనిది ఏమిలేదన్నారు. వారిలో పట్టుదల, కృషి ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఏమైనా చిరువ్యాపారాలు గానీ, మీకు సంబంధించిన వ్యాపారాలు గానీ చేస్తామని చెబితే ఎప్పుడు అండగా తాను ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. అవసరమైతే బ్యాంకర్లతో సమావేశమై స్వయం ఉపాధికి సంబంధించి రుణాలు ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ నివాసానికి హోంమంత్రి


హోంమంత్రికి స్వాగతం పలుకుతున్న అస్మిత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని లక్ష్మీనగర్‌లో ఉన్న జేసీ నివాసానికి మంగళవారం హోం మంత్రి వంగలపూడి అనిత వెళ్లారు. ఆమెను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఘనంగా ఆహ్వానించి తేనేటి విందు ఇచ్చారు. అనంతరం వారు గత వైసీపీ ప్రభుత్వంలో తమపై, టీడీపీ కార్యకర్తలపై పెట్టిన కేసులపై హోంమంత్రితో చర్చించినట్లు సమాచారం. గతంలో పెట్టిన కేసులన్నీ పరిశీలించి కొట్టివేయాలని, అలాగే ఎస్వీ రవీంద్రారెడ్డి, అలియాస్ పొట్టి రవిపై అనేక కేసులు బనాయించి జిల్లా బహిష్కరణ చేశారని, వాటిని కూడా పరిశీలించాలని ఆమెను కోరారు. అనంతరం శాలువా కప్పిసత్కరించారు. హోం మంత్రి వెంట శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఉన్నారు.

పోలీస్ స్టేషన్లకు నూతన భవనాలు నిర్మించండి

- హోం మంత్రికి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వినతి

ఉరవకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండ అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్ల భవనాలు శిథిలావస్థకు చేరాయని, వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని హోంశాఖా మంత్రి వంగలపూడి అనితకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి విన్నవించారు. డీఎస్పీల పెరేడ్ కార్యక్రమానికి మంగళవారం అనంతపురానికి వచ్చిన హోం మంత్రిని, డీజీపీ ద్వారకాతిరుమల రావును ఎమ్మెల్సీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉరవకొండలో అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్ల భవనాలు శిథిలావస్థకు చేరాయని, అందులో సిబ్బంది విధులు నిర్వహించడానికి కష్టంగా ఉందని వారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే నూతన భవనాలు నిర్మించాలని కోరారు.

కార్యకర్తలపై అక్రమ కేసులు ఎత్తేయండి

పుట్లూరు: గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆ పార్టీ నాయకులు సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్ బాలరంగయ్య హోంమంత్రికి విన్నవించారు. అనంతపురంలో వారు హోంమంత్రిని కలిసి మాట్లాడారు. మండలానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పుట్లూరు రామాంజనేయులు, వడ్డే నవీన్‌పై గత ప్రభుత్వంలో అక్రమంగా కేసులు పెట్టారని, ప్రస్తుతం వారు సబ్‌జైలులో ఉన్నారని తెలిపారు. మరోసారి విచారించి కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, ఓబులాపురం శ్రీనివాసులు నాయుడు హోంమంత్రిని కలిసి పలు సమస్యలను విన్నవించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ర్యాలీ

కుందుర్పి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, జూనియర్ కళాశాల విద్యార్థులు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహ న ర్యాలీ చేపట్టారు. పురవీధుల్లో ర్యాలీ చేసి ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని నినాదాలు చేశారు. ఆర్టీఓ, ఎంవీఐ, కళాశాల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయంలో సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆలయం పర్యవేక్షణ, సేవా సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు ఆలయ ఈఓ వాణికి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ఆలయానికి రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతోందని, కానీ ఇక్కడ సౌకర్యాలు మాత్రం మెరుగుపడడం లేదని అన్నారు. వసతి గదుల్లో ఫ్యాన్లు, ఏసీలు సక్రమంగా పనిచేయటం లేదని, పార్కుల్లో చెత్తచెదారం నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. వెంటనే వాటిని మెరుగుపరచాలని కోరారు. అలాగే భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత ప్రసాదం, రాత్రిసమయాల్లో అన్నదానం కొనసాగించాలని అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సమితి కన్వీనర్ ఆర్ శ్రీనాథ్‌గౌడ్, కో-కన్వీనర్లు సభ్యులు పాల్గొన్నారు.

మండల సమావేశం

ఉరవకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో సభ్యులు పలు అంశాలపై చర్చించారు. తొలుత వ్యాసాపురం సర్పంచ్ సీతారాములు మాట్లాడుతూ పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన తాగునీటి మోటార్లు అమ్ముకున్న సబ్ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వ్యాసాపురం, నెరమెట్ల, రాయంపల్లి గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేసే చెరువుకు నీటిని ఎందుకు నింపలేదని ఆయా గ్రామాల సర్పంచులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్యను నిలదీశారు. ఫిల్టర్‌బెడ్లు ధ్వంసంచేసి పొలాలకు నీళ్లు మళ్లించుకున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఉరవకొండకు గతంతో పోలిస్తే తాగు నీటి సరఫరా మెరుగైందని, ఇంకా నీటిని శుద్ధి చేసి వదలాలని ఎంపీటీసీ చంద్రమ్మ పేర్కొన్నారు. ఫిల్టర్‌బెడ్లు మార్చేందుకు వీలుకాదని, మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశంతో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ తెలిపారు. ఇంకా పలు అంశాలపై సభ్యులను అధికారులను నిలదీశారు. సమావేశంలో ఎంపీడీవో రవిప్రసాద్, తహసీల్దార్ మహబూబ్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమ్మను రోడ్డుపై ఎలా వదిలేస్తారు?

- తిరుపతమ్మ కొడుకు, కుమార్తెలను ప్రశ్నించిన ఆర్డీఓ
- బాధ్యత తీసుకోకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరిక

పత్తికొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కని, పెంచి పెద్ద చేసిన తల్లిని రోడ్డుపై ఎలా వదిలేస్తారని, ఇలా చేస్తే సీనియర్ సిటిజన్ ప్రొటెక్షన్ యాక్టు కింద జైలుకు వెళ్లాల్సి వస్తుందని వృద్ధురాలు తిరుపతమ్మ కేసు విచారణలో ఆర్డీవో భరత్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి బాధ్యతను తీసుకునేందుకు వృద్ధురాలి కుమారుడు, కుమార్తెలు నిరాకరించడంతో సోమవారం వారిపై సుమోటో కింద పత్తికొండ సీఐ జయన్న సీనియర్ సిటిజన్ ప్రొటెక్షన్ యాక్టు కింద కేసు నమోదు చేసిన విషయం విదితమే. కేసు విచారణకు సీఐ గుంతకల్లులో నివాసం ఉంటున్న వృద్ధురాలి కుమారుడిని, బళ్లారి, పత్తికొండలో ఉంటున్న కుమార్తెలను మంగళవారం స్థానిక ఆర్డీవో భరత్‌నాయక్ ఎదుట హాజరుపరిచారు. ఆర్డీఓ వారితో మాట్లాడుతూ తల్లిని పోషించడం బిడ్డల బాధ్యత అని.. ఇలా రోడ్డుపై వదిలేయం సరికాదని అన్నారు. తల్లి బాధ్యతపై మరోసారి ఆలోచించుకునేందుకు మూడురోజులు గడువు ఇస్తున్నామన్నారు. మీ నిర్ణయంలో మార్పులేకపోతే చట్టపరంగా చర్యలకు సిద్ధం కావాల్సి ఉంటుందని అన్నారు. ఈ కేసులో జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.